FOR ADS.......
CONTACT: 8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :199 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ బుధవారం- 11 - మార్చి - 2026

## తిరుమలకు వెళుతున్న కారులో అలిపిరి వద్ద భారీగా నగదు స్వాధీనం



- అలిపిరి వద్ద సాధారణ తనిఖీల్లో రూ.60 లక్షల నగదును గుర్తించిన విజిలెన్స్ సిబ్బంది
- నాణేల మార్పిడి కోసం నగదును తీసుకెళుతున్నట్టు చెప్పిన వ్యక్తి
- సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు

తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ కొనసాగుతున్న వేళ, అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భారీ మొత్తంలో నగదు పట్టుబడటం కలకలం రేపింది. టీటీడీ విజిలెన్స్ విభాగం నిర్వహించిన సాధారణ తనిఖీల్లో ఒక కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.60 లక్షల నగదును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉదయం ఒక వ్యక్తి తన కారులో మిగతా..2లో

## చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు... ఈ నెల 13న ప్రారంభం



- చర్లపల్లి – కామాఖ్య మధ్య కొత్త అమృత్ భారత్ రైలు
- మార్చి 13న కామాఖ్యలో ప్రారంభించనున్న రైల్వే శాఖ
- తెలుగు రాష్ట్రాల్లో పలు ముఖ్య స్టేషన్లలో ఆగుతుందని ప్రకటన
- తక్కువ ఖర్చుతో సురక్షితమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యం
- ఇటీవలే నాగర్‌కోయిల్ – చర్లపల్లి మధ్య మరో రైలును ప్రకటించిన రైల్వే

హైదరాబాద్: హైదరాబాద్‌లోని చర్లపల్లి స్టేషన్ నుంచి అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాఖ్య వరకు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. ఈ కొత్త రైలు సర్వీసును మార్చి 13న కామాఖ్యలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను ఈశాన్య రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉండే అసోంతో కలుపుతుంది. మిగతా..2లో

## లక్షల గొంతుకల పోరాటం.. 15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం: మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్



2

- మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ స్పెషల్ పోస్టు
- తెలంగాణ ఉద్యమంలో అదొక కీలక ఘట్టమని వెల్లడి
- నిర్బంధాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఆపలేకపోయాయని వ్యాఖ్య
- ట్యాంక్‌బండ్‌పై లక్షల గొంతుకలు గర్జించాయని పోస్టులో పేర్కొన్న కేటీఆర్

# గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

- రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.
- ఇవాళ వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్, మార్చి 10: రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇవాళ(మంగళవారం) వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళు ,, గురుకులాల అభివృద్ధికి మిగతా..2లో

## నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి?

- రంగనాయక్ సాగర్ పనులను వెంటనే పూర్తి చేయాలని బండి సంజయ్ డిమాండ్
- పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శ
- పనులు పూర్తయి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని వ్యాఖ్య

హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్‌ఎం 4, ఎల్‌ఎం 6)



కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు.

## విజయ్, త్రిష వ్యవహారంపై స్పందించిన బీజేపీ నాయకురాలు ఖుష్బూ



2

- వీరి విషయంలో ప్రజలకు ఏం ఆసక్తి అనేది అర్థం కావడం లేదన్న ఖుష్బూ
- అది వారి వ్యక్తిగత విషయమన్న ఖుష్బూ
- దీనిని ఎందుకు పెద్ద విషయంగా చూస్తున్నారని ప్రశ్న

ఢిల్లీ : ప్రముఖ తమిళ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్, నటి త్రిష వ్యవహారంపై తమిళనాడు బీజేపీ నాయకురాలు ఖుష్బూ స్పందించారు. వీరి విషయంలో ప్రజలకు ఏం ఆసక్తి అనేది తనకు అర్థం కావడం లేదని అన్నారు.

## హర్ముజ్ సంక్షోభం నుంచి భారత్ గట్టెక్కగలదా యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే పరిస్థితేంటి

- భారత్‌పై మొదలైన 'హర్ముజ్ ఎఫెక్ట్'- మనదేశానికి జరిగే చమురు సప్లైలకు తీవ్ర అంతరాయం
- భారత్ వద్ద స్ట్రాటజిక్, ఆపరేషనల్ నిల్వలు



ఢిల్లీ : అమెరికా – ఇజ్రాయెల్‌లతో యుద్ధంలో ఉన్న ఇరాన్ హర్ముజ్ జలసంధిని మూసివేసిన ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఎల్‌పీజీ వంటగ్యాస్ డెలివరీల వ్యవధిని పెంచేశారు. మార్చి 7 నుంచి ఇప్పటివరకు గృహ వినియోగ సిలిండర్ ధర సగటున రూ.60 పెరిగింది. వాణిజ్య సిలిండర్ ధరను రూ.115 వరకు పెంచారు. యుద్ధం కనుక దీర్ఘకాలంపాటు కొనసాగితే, ఎల్ పీజీ కొరత ఏర్పడే అవకాశం ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వం దేశీయ ఇంధన మార్కెట్ ను కాపాడడానికి మంగళవారం నిత్యావసర వస్తువుల చట్టం (ఈసీ యాక్ట్ )ను అమల్లోకి తెచ్చింది. దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎల్ పీజీ ఉత్పత్తిని పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ లాంటివి జరగకుండా గృహ వినియోగదారులకు 100 శాతం వంట గ్యాస్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. వాహనదారులకు సీఎన్ జీ కూడా నిరంతరం సరఫరా అయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. ఇక కమర్షియల్ ఎల్ పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ఇప్పటికే ఇబ్బందులు మొదలయ్యాయి. మిగతా..2లో

## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం



ఢిల్లీ : వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. మిగతా..2లో

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు.. పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు



2

- ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన వేడుకల రద్దు
- ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కీలక నిర్ణయం
- జిల్లా, నగర, మండల కేంద్రాల్లో స్థానికంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలన్న పవన్

అమరావతి : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ప్రణాళికలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

# తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతి అభివృద్ధి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, మౌలిక వసతులపై ప్రధానంగా చర్చ, తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి రూ. 119 కోట్లు



అమరావతి : తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు ఉండాలని తేల్చి చెప్పారు. పెట్టుబడులు పెట్టడానికి వచ్చే సంస్థలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. రాజధానిలోని మిగతా..2లో

## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు



2

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

అమరావతి : గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెంట్ వ్యాపారాన్ని

మొదటి పేజి తరువాయి

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకల రద్దు..
# పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు

ఈ నెల 14న పిఠాపురంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించాలని జనసేన తొలుత నిర్ణయించింది. అయితే, ఆ వేడుకలను రద్దు చేస్తున్నట్లు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వాతావరణ పరిస్థితులపై అందిన నివేదికలను దృష్టిలో ఉంచుకుని జనసైనికుల క్షేమం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తొలుత పిఠాపురం వేదికగా రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని భావించినప్పటికీ, ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యూహం మార్చారు. రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభకు బదులుగా, ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా, నగర, మండల కేంద్రాల్లో ఎక్కడికక్కడ స్థానికంగానే ఘనంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. మార్చి 14 అనేది జనసైనికులకు, వీర మహిళలకు ఒక పండగలాంటి రోజని, ఆ ఉత్సాహం తగ్గకుండా స్థానిక స్థాయిలోనే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. పిఠాపురంలో భారీ సభ రద్దు కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన కార్యాలయాలు పండుగ వాతావరణానికి సిద్ధమవుతున్నాయి. నియోజకవర్గాల వారీగా పార్టీ జెండా ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాలతో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

నిధుల మంజూరుపై సమీక్షించారు. 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలి' అని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుంది. డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభావాలపై కళారూపాల ద్వారా యువతకు అవగాహన కల్పించాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి?

ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## లక్షల గొంతుకల పోరాటం.. 15 ఏళ్ల కిందటి ఉద్యమ ఘట్టం:
# మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్న కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్'కు నేటితో 15 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన అద్భుత పోరాట రూపాల్లో ఇదొకటని ఆయన పేర్కొన్నారు. ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 2011 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్‌ను స్మరించుకున్నారు. "స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు. నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయి" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వరాష్ట్రం కోసం లక్షల గొంతుకలు ట్యాంక్‌బండ్‌పై ఏకమై నినదించిన అద్భుత పోరాటానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన పోస్టుకు ఆనాటి మిలియన్ మార్చ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను జతచేశారు. "తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

## విజయ్, త్రిష వ్యవహారంపై
# స్పందించిన బీజేపీ నాయకురాలు ఖుష్బూ

ఈ వ్యవహారంతో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని అభిప్రాయపడ్డారు. అది వారి వ్యక్తిగత విషయమని వెల్లడించారు. దీనిని ఎందుకు పెద్ద విషయంగా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమానికి ఖుష్బూ హాజరయ్యారు. ఈ క్రమంలో విజయ్, త్రిష అంశం తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీపై ప్రభావం చూపుతుందా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. ఖుష్బూ స్పందిస్తూ, ఎవరికి, ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని అన్నారు.

## తిరుమలకు వెళుతున్న కారులో
# అలిపిరి వద్ద భారీగా నగదు స్వాధీనం

తిరుమల కొండపైకి వెళుతుండగా, అలిపిరి వద్ద విజిలెన్స్ సిబ్బంది వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో కారులో దాచి ఉంచిన కరెన్సీ కట్టలు బయటపడ్డాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు సదరు వ్యక్తిని నిలదీయగా, తిరుమలలో నాణేల మార్పిడి కోసం ఈ నగదును తీసుకెళుతున్నట్టు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. అంత భారీ మొత్తానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేదా బ్యాంకు పత్రాలు చూపకపోవడంతో, విజిలెన్స్ అధికారులు నగదుతో పాటు సదరు వ్యక్తిని అలిపిరి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? దీని అసలు యజమాని ఎవరు? నిజంగానే నాణేల కోసమా లేక ఇతర రాజకీయ లేదా వ్యాపార లావాదేవీల కోసమా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో పలు ఘటనలు చర్చనీయాంశంగా మారిన తరుణంలో, ఈ భారీ నగదు పట్టుబడటం మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.

## చర్లపల్లి-కామాఖ్య అమృత్ భారత్ రైలు...
# ఈ నెల 13న ప్రారంభం



ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. తక్కువ ఖర్చుతో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే ఈ రైలు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే సుదూర ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు శ్రీకాకుళం రోడ్, విజయనగరం, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతుంది. రెండు రోజుల క్రితమే తమిళనాడులోని నాగర్‌కోయిల్ నుంచి చర్లపల్లి వరకు మరో అమృత్ భారత్ రైలును రైల్వే శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లను ప్రవేశపెట్టారు. అధునాతన భద్రతా ఫీచర్లు, సెమీ ఆటోమేటిక్ కప్లర్లు, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్ వంటి సౌకర్యాలతో వీటిని రూపొందించారు. నాన్-ఏసీ కోచ్‌లలో కూడా ప్రయాణికుల భద్రత కోసం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ఈ రైళ్ల ప్రత్యేకత.

# తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతి అభివృద్ధి

మొదటి పేజి తరువాయి

వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథారిటీ సమావేశం ఆమోదించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయించారు. హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణానికి రూ.2,316 కోట్లు: తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపునకు ఆమోదం లభించింది. పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయించేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. అందుకుగాను రూ. 119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అధికారులకు సీఎం దిశానిర్దేశం: నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్న సీఎం, అందుకు మొత్తంగా 167 ఎకరాల



విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయని, పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. హోటళ్లు, అమ్యూజ్ మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలని తెలిపారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోందన్న సీఎం, దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ అని వివరించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయన్నారు. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు సైతం కమర్షియలుగా టర్న్ అవుతాయన్న చంద్రబాబు ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించామని తెలిపారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని వదులుకోకూడదని పెద్ద సంస్థలు భావిస్తుండడం కూటమి ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ అని చెప్పారు.

అమరావతిలో తెలుగు కల్చరల్ సెంటర్:

ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించాలని సూచించారు. రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

మొదటి పేజి తరువాయి

విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

భారతి సిమెంట్‌కు రూ.165 కోట్ల లబ్ధి

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో



వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# ప్రాణాంతక వ్యసనానికి విరుగుడు మందేది?

గుడి, బడి అన్న తేడా లేకుండా అన్నింటి దగ్గరా మద్యం దుకాణాలు కనిపిస్తున్నాయి. మందుబాబులు పూటుగా తాగి రోడ్డుమీదే వీరంగం సృష్టిస్తున్నారు. నేడు చాలామంది మద్యంతో పాటు డ్రగ్స్‌కూ బానిసలుగా మారుతున్నారు. ఇలాంటి వారికి చికిత్స అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాలో, వైద్య కళాశాలల్లోనూ డీఅడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించడం శుభపరిణామం. మిగతా రాష్ట్రాలకూ ఇది అనుసరణీయం. అయితే, డీఅడిక్షన్‌తో పాటు నోఅడిక్షన్‌పైనా దృష్టి సారించడం అత్యావశ్యకం. దేశంలో మద్యం వినియోగం అంతకంతకు పెరిగిపోతోంది. అత్యధిక మద్యం వినియోగమవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపీ ఉన్నాయి. చాలాచోట్ల ఎగువ, దిగువ తరగతి వర్గాల్లో మందు తీసుకోవడాన్ని అత్యంత సాధారణ, అంగీకారయోగ్యమైన విషయంగా చూస్తున్నారు. చాలాకాలం ఆల్కహాల్‌కు దూరంగా ఉంటూ వచ్చిన మధ్యతరగతి కూడా ఇప్పుడు మద్యపానం మత్తులో పడుతోంది. నగరాలు, గ్రామాలనే తేడా లేకుండా యువకులు, ముఖ్యంగా కాలేజీ, హైస్కూల్ విద్యార్థులు మద్యానికీ, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లోని మానసిక చికిత్సాలయానికి(ఐఎంహెచ్) మొన్న ఒక్క జనవరిలోనే ఇలాంటివి 700కేసులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో సుమారు 25లక్షల మంది మద్యం లేకుండా రోజు గడవని దుస్థితిలోకి వెళ్లిపోయారని అంచనా! ఇలాంటి వారి కోసం ప్రభుత్వ వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో పదేసి పడకలతో డీఅడిక్షన్ సెంటర్లను నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. కానీ, అక్కడ అందించే చికిత్సలు వ్యసనం నుంచి మందుబాబులను పూర్తిగా బయటపడేస్తాయా?

చుట్టుముడుతున్న వ్యాధులు...

డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్సతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇస్తారు కాబట్టి, బాధితులపై ఆ ప్రభావం కొన్నాళ్లవరకు ఉంటుంది. కానీ, చికిత్స తరవాత వారు మళ్లీ మద్యం సేవించడానికి 60శాతం మేర అవకాశాలున్నాయి. మానసిక ఒత్తిళ్లు, ఆందోళన, కుంగుబాటు, నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, కుటుంబ పరిస్థితులు సరిగ్గా లేకపోవడం వంటివి మళ్లీ మద్యాన్ని ఆశ్రయించేలా వారిని పురిగొల్పుతున్నాయి. అయితే, 'మల్టీ మోడల్, మల్టీ స్పెషాలిటీ' సేవల ద్వారా ఈ సమస్యను అధిగమించే అవకాశముంది. బాధితులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు సలహాలివ్వడంతో పాటు కుటుంబంలో, పనిచేసే చోట వారి ప్రవర్తనను గమనిస్తూ ఉండాల్సి ఉంటుంది. అయితే, దీనికి నిపుణుల తోడ్పాటు అవసరం. దేశంలో సుమారు 17కోట్ల మంది ఆల్కహాల్ తీసుకునేవారిలో వ్యసనపరులు ఆరు కోట్ల మంది ఉంటారని అంచనా. వీరిలో మూడోవంతు మందిలో జీర్ణవ్యవస్థ పోషకాలను శోషించుకునే సామర్థ్యాన్ని కోల్పోతోంది. 15శాతం మందిలో మద్యపానం అధిక రక్తపోటుకు కారణమవుతోంది. మెదడులో రక్తస్రావం జరిగే ప్రమాదాన్నీ పెంచుతోంది. లివర్ సమస్యలకూ; జీర్ణకోశ, పేగు క్యాన్సర్లకూ ఆల్కహాల్ ప్రధాన కారణమవుతోంది. ఇలా దేశంలో ఏటా దాదాపు మూడు లక్షల మరణాలకు మద్యపానమే ప్రధాన కారణమవుతోంది. అందుకనే, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆల్కహాల్‌ను గ్రూప్-1 క్యాన్సర్ కారకాల జాబితాలో చేర్చింది. అనారోగ్యానికే కాదు, మద్యపానం వల్ల భారీ సంఖ్యలో రోడ్డు ప్రమాదాలూ జరుగుతున్నాయి. నిజానికి మద్యం, మత్తుపదార్థాలకు బానిసలుగా మారిన వారిలో 5-12శాతం మంది ప్రమాదకర స్థితిలోకి వెళ్లిపోతుంటారు. తీవ్రస్థాయి మానసిక వ్యాధులు, నరాల బలహీనతకు గురవుతారు. ఆల్కహాల్ విచక్షణ కోల్పోయేలా చేసి, హింసాత్మక ఆలోచనలను ప్రేరేపిస్తుంది. సాధారణ కుటుంబాలతో పోలిస్తే, భర్త తాగొచ్చే ఇళ్లలో హింస మూడురెట్లు అధికంగా ఉంటుందని అంచనా. మద్యం మత్తులో గొడవలు, హత్యలు, ఆత్మహత్యలు జరుగుతుంటాయి. ఇంట్లో ఒక్క వ్యసనపరుడు ఉన్నా కుటుంబం మొత్తం కష్టాలపాలవుతుంది. దానివల్ల పిల్లలు అన్యాయమైపోతారు. భవిష్యత్తులో వారు కూడా మద్యంప్రియులు

# హార్ముజ్ సంక్షోభం నుంచి భారత్ గట్టెక్కగలదా యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే పరిస్థితేంటి

మొదటి పేజి తరువాయి

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు రేట్లు భారీగా పెరిగాయి. త్వరలోనే పెట్రోలు, డీజిల్ ధరలనూ పెంచుతారని అంటున్నారు. మన దేశం వినియోగించే ముడి చమురు, ఎల్ఎన్జీ, ఎల్పీజీలలో దాదాపు 85 నుంచి 89 శాతం విదేశాల నుంచే వస్తోంది. భారత్ ఎక్కువగా మిడిల్ ఈస్ట్ దేశాల నుంచే వీటిని కొనుగోలు చేస్తుంటుంది. ఆ దేశాల నుంచి హార్ముజ్ జలసంధి మీదుగా భారత్‌లోని ఓడరేవులకు ఇంధన వనరులు చేరుతాయి. మరి ఇప్పుడు ఏర్పడిన హార్ముజ్ సంక్షోభం నుంచి భారత్ గట్టెక్కగలదా? ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ వార్ నెలల తరబడి కొనసాగితే భారత్ పరిస్థితేంటి? ఎన్ని నెలలకు సరిపడా ముడి చమురు, ఎల్ఎన్జీ, ఎల్పీజీ నిల్వలు భారత్ దగ్గరున్నాయి? పశ్చిమాసియా ఉద్రిక్తతల ఎఫెక్ట్ ఇంధన ధరలపై పడుతుందా? అనే అంశాలపై ఇంధన రంగ నిపుణుల విశ్లేషణను ఈ కథనంలో తెలుసుకుందాం.

హార్ముజ్ ఎఫెక్ట్ - ఇరాన్ ప్లాన్

హార్ముజ్ జలసంధి ఇరాన్ పరిధిలో ఉంది. ఇది పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని అరేబియా సముద్రంతో కనెక్ట్ చేస్తుంది. అందుకే ఇది అత్యంత వ్యూహాత్మక సముద్ర మార్గం. సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), కువైట్ వంటి దేశాలకు చెందిన ముడి చమురు, సహజ వాయువు హార్ముజ్ జలసంధి మీదుగానే ప్రపంచ దేశాలకు సప్లై అవుతుంది. ఇప్పుడు ఈ మార్గం మీదుగా ఆయిల్ ట్యాంకర్లు, నౌకలను ఇరాన్ ఆర్మీ వెళ్లనివ్వడం లేదు. తద్వారా అరబ్ దేశాలకు ఆరో ప్రాణమైన చమురు వ్యాపారాన్ని దెబ్బతీసి, తనపై దాడులు చేస్తున్న అమెరికాపై ఒత్తిడిని పెంచాలని ఇరాన్ భావిస్తోంది. కానీ ఈ పరిణామం ప్రభావం ఇంధన వనరుల కోసం అరబ్ దేశాలపైనే ఆధారపడిన భారత్ లాంటి దేశాలపైనా పడుతోంది.

ఈ యుద్ధం ఎక్కువ కాలం కొనసాగదు: ఎంకే సురానా

"ప్రస్తుతానికి మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి అస్థిరంగానే ఉంది. కానీ ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ సైనిక ఉద్రిక్తతలు ఎక్కువ కాలం పాటు కొనసాగే అవకాశాలు లేవు. ఎందుకంటే ప్రపంచం అంతపెద్ద అంతరాయాన్ని ఎక్కువ కాలం పాటు భరించలేదు. చమురు వాణిజ్యం కుదేలు అవుతున్నందున అరబ్ దేశాలు దౌత్యపరమైన మార్గాల్లో ఈ యుద్ధాన్ని ఆపే దిశగా అడుగులు వేయొచ్చు. అయితే ఈ యుద్ధం ఆగే వరకు చమురు సంక్షోభాన్ని ప్రపంచ దేశాలు ఎంత సమర్థంగా ఎదుర్కొంటాయి అనేది కీలకమైన అంశం. పశ్చిమాసియా నుంచి ముడి చమురు సప్లైలో ఏర్పడిన అంతరాయాలు ఇప్పటికే మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. దీని ఫలితంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. హార్ముజ్ జలసంధి మీదుగా ప్రతిరోజు 20 మిలియన్ టన్నుల చమురు సప్లై జరిగేది. ఇప్పుడది ఆగిపోయింది" అని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) మాజీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంకే సురానా విశ్లేషించారు.

ఇలాంటి సంక్షోభాల్లో రెండు అతిపెద్ద నష్టాలు

"ఇలాంటి సంక్షోభాల సమయంలో రెండు అతిపెద్ద నష్టాలు ఉంటాయి. మొదటిది ఏమిటంటే, సరఫరా లభ్యత అంతగా ఉండదు. రెండోది ఏమిటంటే, మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. ఎందుకంటే ప్రపంచ దేశాల దగ్గర అంతపెద్దగా ఇంధన నిల్వలు ఉండవు. సప్లైలో ఏమాత్రం అనిశ్చితి ఏర్పడినా ముడి చమురు ధరలు పెరిగిపోతాయి. దీంతో రవాణా ఛార్జీలు పెరుగుతాయి. ఫలితంగా నిత్యావసరాల రేట్లు పెరుగుతాయి. ఈ అంశం జన జీవితాలపై భారాన్ని పెంచుతుంది" అని ఎంకే సురానా తెలిపారు.

భారత్ చమురు నిల్వలు రెండు కేటగిరీలు

"భారతదేశ చమురు నిల్వలను రెండు కేటగిరీలుగా డివైడ్ చేయొచ్చు. మొదటి కేటగిరీ వ్యూహాత్మక (స్ట్రాటజిక్) నిల్వలు. రెండో కేటగిరీ కార్యాచరణ (ఆపరేషనల్) నిల్వలు. భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు కేవలం ఆరు రోజులకే సరిపోతాయి. కానీ కార్యాచరణ నిల్వలను దాదాపు 74 రోజుల వరకు వినియోగించుకోవచ్చు. ఈ రెండు కేటగిరీల చమురు కూడా ఆయిల్ రిఫైనరీల ట్యాంకులు, ఓడరేవుల వద్ద ఉంటుంది. ఈ నిల్వల వల్లే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు రేట్లు పెరిగినా, వెంటనే పెట్రోలు, డీజిల్ ధరలను భారత ప్రభుత్వం పెంచదు. అంటే ఇంధన ధరల పెరుగుదలను అడ్డుకునే అస్త్రంగా ఈ నిల్వలు పనికొస్తున్నాయి. ముడి చమురు కొరత కారణంగా వీటినీ వాడుకునే పరిస్థితి వస్తే, పెట్రోలు, డీజిల్ రేట్లు పెరుగుతాయి. వంట గ్యాస్ (ఎల్పీజీ)ను భారత చమురు కంపెనీలు ఇప్పటికే నష్టానికి అమ్ముతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వాటిపై నష్టాల భారం మరింత పెరిగే ముప్పు ఉంది" అని ఐసీఆర్ఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కో గ్రూప్ హెడ్ ప్రశాంత్ వశిష్ట్ హెచ్చరించారు.

ముడి చమురు సేకరణ నుంచి పంపింగ్ దాకా

"ముడి చమురు, సహజ వాయువు పశ్చిమాసియా దేశాలు, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, రష్యాల నుంచి భారతదేశంలోని ఓడరేవులకు చేరుకుంటాయి. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా ఆయిల్ రిఫైనరీలకు వాటి సప్లై జరుగుతుంది. అనంతరం వాటిని ఆయిల్ రిఫైనరీలలో ప్రాసెస్ చేసి పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, విమాన ఇంధనంలుగా మారుస్తారు. తదుపరిగా దేశవ్యాప్తంగా ఉన్న డిపోలు, పెట్రోల్ పంపులకు పంపిణీ చేస్తారు. ఈవిధంగా సేకరణ నుంచి పంపింగ్ వరకు దాదాపు 45 నుంచి 60 రోజుల టైం పడుతుంది" అని ప్రశాంత్ వశిష్ట్ చెప్పారు.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో భూగర్భంలో వ్యూహాత్మక నిల్వలు

"భారతదేశం వద్దనున్న వ్యూహాత్మక చమురు నిల్వల విషయానికొస్తే, ఇవి పెట్రోలియం మంత్రిత్వ శాఖలోని చమురు కంపెనీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పర్యవేక్షణలో ఉంటాయి. ఇందుకోసం సాధారణంగా 6 నుంచి 8 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును సిద్ధంగా ఉంచుతారు. వీటిని అత్యవసరాల్లో వినియోగిస్తారు. భద్రతా కారణాల దృష్ట్యా వ్యూహాత్మక చమురు నిల్వలను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలలో భూగర్భంలో దాచి ఉంచారు. ఇక కార్యాచరణ నిల్వలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి చమురు కంపెనీలు నిర్వహిస్తాయి. ఇవి 50 నుంచి 60 రోజుల అవసరాలను తీర్చగలవు. సంక్షోభ సమయంలో జాతీయ చమురు సరఫరాకు మద్దతు ఇవ్వాలని ప్రైవేట్ శుద్ధి కర్మాగారాలను ప్రభుత్వం ఆదేశించొచ్చు" అని సీనియర్ ఇంధన రంగ నిపుణుడు సుధీర్ బిష్ట్ తెలిపారు.

దిద్దుబాటు చర్యలతోనే సంక్షోభాలను ఎదుర్కోవచ్చు

"భారత ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు ఎక్కువగా మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి చమురును కొంటున్నాయి. కానీ రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ లాంటి ప్రైవేట్ రిఫైనరీలు ఎక్కువగా రష్యా నుంచి చమురును కొంటున్నాయి. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనాల కొరతను భారత్ ఎదుర్కొంటుందని నేను భావించడం లేదు. అయితే ఎల్ఎన్జీ విభాగంలో భారత్ బలహీనంగా ఉంది. దాదాపు 60 శాతం ఎల్ఎన్జీని మనం ఒక్క ఖతర్ నుంచే సప్లై చేసుకుంటున్నాం. ఈవిషయంలోనూ వైవిధ్యాన్ని పాటిస్తే బాగుండేది. పశ్చిమాసియా సైనిక ఘర్షణ ముగిసే వరకు పైప్ లైన్ల ద్వారా ఎల్ఎన్జీ సప్లైకు అంతరాయం ఏర్పడొచ్చు. ఈ పరిస్థితి రాకూడదు అంటే, చమురు దిగుమతుల కోసం దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవాలి. షిప్పింగ్ లభ్యతను, ఆయిల్ రిఫైనరీల సామర్థ్యాన్ని పెంచాలి. అత్యవసర పరిస్థితుల్లో వైటల్ లేదా ట్రాఫిగురా వంటి స్పాట్ మార్కెట్ల నుంచి ముడి చమురును కొనొచ్చు. అయితే అక్కడ రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఇరాన్, అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధం మూడు నెలల కంటే ఎక్కువ కొనసాగితే అది పెద్ద సమస్యలు ఎదురుకావచ్చు" అని ఇంధన రంగ నిపుణుడు సుధీర్ బిష్ట్ చెప్పారు.

చమురు రేట్ల పెరుగుదల కొనసాగితే అంతే సంగతి

"విదేశాల నుంచి దిగుమతి చేసుకునే చమురుపైనే భారతదేశం ఆధారపడటం వల్ల, సప్లైకు అవాంతరం కలిగినప్పుడల్లా ఇక్కడ ఇంధన ధరలు పెరుగుతాయి. ప్రస్తుతం ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. ఈ ధరలే ఎక్కువ కాలం పాటు కొనసాగితే, చమురు మార్కెటింగ్ కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారులపైకి బదిలీ చేస్తాయి. అంటే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచుతాయి. దీనివల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. రవాణా ఖర్చులు పెరిగితే, నిత్యావసరాల రేట్లు కూడా పెరుగుతాయి" అని ఆర్థికవేత్త శరద్ కోహ్లీ విశ్లేషించారు.

చమురు, సహజ వాయువు రంగానికి భారత్ ప్రాధాన్యత పెంచాలి

"ఇకనైనా చమురు, సహజ వాయువు రంగానికి జాతీయ స్థాయి ప్రాధాన్యతను భారత ప్రభుత్వం ఇవ్వాలి. చమురు, గ్యాస్ అన్వేషణ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలి.

# సంపాదకీయం

## భారత్‌కు భాగవత్ దిశా నిర్దేశమేమిటి

'మనం ప్రతి ఒక్కరినీ ఎలాంటి ప్రతిఘటన లేకుండా అంగీకరించాలి' (సర్వేషాం అవిరోధేనా) అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ ఒక సందర్భంలో చెప్పారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100వ సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా ఆయన దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ పలు సభల్లో ప్రసంగిస్తున్నారు. అనేక వర్గాల వారితో సమావేశమై సంభాషణలు జరుపుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ఒకప్పుడు ఆర్‌ఎస్ ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించినవారు, ఆ సంస్థపై ఏ అభిప్రాయం లేని తటస్థులతో పాటు రకరకాల వర్గాల్లో దూరి తమ ఉనికిని చాటుకునే మహానుభావులు సైతం మోహన్ భాగవత్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. విద్యావేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు, వణిక్ ప్రముఖులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, నటులు, మీడియా ప్రతినిధులు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు ముంబైలో అక్షయ్‌కుమార్, రణబీర్‌కపూర్, సల్మాన్ ఖాన్ తదితర తారాగణం భాగవత్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. మంచి సందేశాలు వ్యాప్తి చేసే సినిమాల్లో నటించినందుకు సల్మాన్ ఖాన్‌ను భాగవత్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో వామపక్షీయులు కూడా భాగవత్ ప్రసంగానికి హాజరుకావడం గమనార్హం. ఇంత విస్తృత స్థాయిలో వివిధ వర్గాల వారిని ఒక సంస్థ ఆకర్షించడం సాధారణ విషయం కాదు. దేశం ఇప్పుడు ఒక సైద్ధాంతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సిద్ధాంతాల ప్రాతిపదికన జరిగిన అనేక ఉద్యమాలు పరీక్షలకు, సమీక్షలకు, వైఫల్యాలకు లోనై కొట్టుకుపోయాయి. సైద్ధాంతిక దారిద్ర్యం అంతటా తాండవిస్తోంది. సమాజం పట్ల, అణగారిన వర్గాల పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించేవారు ఒక మూసలో ఇమడలేకపోతున్నారు. ఇప్పుడే కాదు, గతంలో కూడా తత్వవేత్తలు ఇలాంటి సామాజిక పరిస్థితులను ఎదుర్కొని విశ్లేషించిన సందర్భాలున్నాయి. మరి మోహన్ భాగవత్ ప్రస్తుత అయోమయ పరిస్థితులలో ఏమి మాట్లాడతారా అన్న ఆసక్తితోనే అనేకమంది ఆయన సభలకు హాజరు అవుతున్నారని అర్థం చేసుకోవల్సి వున్నది. రకరకాల భావజాలాల అనుయాయులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ విస్తరిస్తుండడం, దాని అనుబంధ రాజకీయ సంస్థ అయిన భారతీయ జనతా పార్టీ తిరుగులేని జాతీయ రాజకీయ శక్తిగా ప్రభావ ప్రాబల్యాలను సంతరించుకోవడం ఒక రకంగా సంఘ్ పరివార్ శక్తులకు సదవకాశం. అయితే 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఒక నిర్దుష్టమైన స్పష్టతతో ఉన్నదా? ఈ విషయాన్ని తరచి చూడవలసిన అవసరం ఉన్నది. హెగ్డేవార్ స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పటి ఆర్‌ఎస్ ఎస్‌కూ ఎంతో తేడా ఉన్నది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి, గత పది సంవత్సరాలకు పైగా నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా కొనసాగడానికి కారణమైన ఆర్‌ఎస్‌ఎస్ ఇవాళ ఒక సంధి దశలో ఉన్నది. కేంద్రంలో మోదీ ఇవాళ ఏమి చేసినా జనం ఆర్‌ఎస్‌ఎస్ వైపు చూస్తున్నారు. మోదీ చేసిన మంచి పనులకు ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎంత ఘనత లభిస్తుందో, ఆయన తీసుకున్న అన్ని నిర్ణయాలకూ ఆర్‌ఎస్‌ఎస్ జవాబుదారీ అవుతుందని చాలా మంది భ్రమిస్తున్నారు. అయోధ్యలో బాల శ్రీరాముడి ప్రతిష్ఠాపన సమయంలో నరేంద్రమోదీ వెనుక మోహన్ భాగవత్ ఉన్న దృశ్యాలను చూసినవారు మోదీకి అన్ని విషయాల్లోనూ మోహన్ భాగవత్ అండగా ఉంటారనుకోవడంలో ఆశ్చర్యం లేదు. విచిత్రమేమంటే జాతీయవాదులు అని తమను తాము చెప్పుకుంటున్నవారు కూడా మోదీ చేసిన అన్ని పనులను పిడివాదంతో సమర్థించడం, ప్రత్యర్థులపై తీవ్ర పరిభాషలో విరుచుకుపడడం ప్రస్తుత సైద్ధాంతిక అయోమయాన్ని మరింతగా తీవ్రతరం చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్‌కూ బీజేపీకి మధ్య ఉన్న తేడాను స్పష్టంగా చెప్పేందుకు మోహన్ భాగవత్ అనేక సమావేశాల్లో ప్రయత్నించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి రాజకీయ అధికార ఆకాంక్ష లేదని, మొత్తం హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, పౌరుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం తమ ఏకైక లక్ష్యమని ఆయన ఇటీవల డెహ్రాడూన్‌లో మాజీ సైనికాధికారుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను బీజేపీతో పోల్చి చూడకూడదని, బీజేపీ కళ్లతో ఆర్‌ఎస్‌ఎస్‌ను చూడడం అతి పెద్ద తప్పిదమని ఆయన గత ఏడాది కోల్‌కతాలో చెప్పారు.

# చైనా గెలుపు మంత్రమేంటి?



ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగిన చైనా విజయ రహస్యం ఏంటి? వాణిజ్య రంగంలో దూసుకెళ్లడానికి అనుసరించే గెలుపు సూత్రమేంటి? చైనా కంపెనీలు స్టార్టప్‌ల స్థాయి నుంచి టెక్ దిగ్గజాలుగా శరవేగంగా ఎలా ఎదుగుతున్నాయి? ఈ విశేషాలను తెలుసుకోవడం ఆసక్తికరమే కాదు, అవసరం కూడా! షాంఘైలోని చైనా యూరప్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్(సీఈఐబీఎస్)కు ఆసియాలో అత్యుత్తమ వాణిజ్య విద్యాసంస్థగా పేరుంది. అందులో నా పూర్వ సహోద్యోగి ఆచార్య లియాంగ్ నెంగ్, అమెరికాలోని వార్టన్ బిజినెస్ స్కూల్‌కు చెందిన హర్బీర్ సింగ్, పీటర్ కాపెలి, మైఖేల్ యూసీమ్‌లతో కలిసి 'ద ఫార్చ్యూన్ మేకర్స్' పుస్తకాన్ని వెలువరించారు. ఆసియా వ్యాపారాలపై ఉన్న సాధారణ అభిప్రాయాలను పటాపంచలు చేసే భిన్నమైన విశ్లేషణను ఆ గ్రంథంలో అందించారు. చైనా పారిశ్రామిక వ్యవస్థాపకుల విజయాలకు అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అందిస్తున్న అండదండలే కారణమనుకోవడం సరికాదని స్పష్టంచేశారు. అటువంటి అండ లేకపోయినా వారు రాణిస్తున్నారని తేల్చారు. వ్యాపార స్థాపన, అభివృద్ధికి అన్ని వేళలా వ్యవస్థాగతమైన మద్దతు లభించకపోవచ్చు. మార్కెట్‌లో పోటీ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నా స్వశక్తితో తట్టుకుని నిలబడి వ్యాపారాన్ని విజయవంతం చేసుకోవాల్సి ఉంటుంది. తమకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు దూసుకెళ్లాల్సిందే. వ్యాపార పరంగా వివిధ పక్షాలతో సంబంధాలను వృద్ధి చేసుకుంటూ పురోగమించాల్సిన అవసరం ఉంటుంది.

### నిరంతర తపన

అంతా బాగుంటే సమస్యలూ ఉండవు, వాటిని అధిగమించడానికి కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరమూ ఉండదు. వనరుల సమృద్ధికంటే కొరతలు, ప్రతిబంధకాలే నవీకరణను సాధించాలనే తపనను పుట్టిస్తాయి. చైనీయులు పాశ్చాత్య వ్యాపార నమూనాలపై పూర్తిగా ఆధారపడకుండా స్థానిక పరిస్థితులకు తగినట్లుగా మార్పుచేర్పులు చేసుకున్న నమూనాలనే అనుసరిస్తారు. ఈ క్రమంలోనే కొత్తదనాన్ని అన్వేషించి, ఆవిష్కరిస్తారు. మార్కెట్ గురించి పూర్తి సమాచారం కోసం ఎదురు చూడకుండా, తక్షణం రంగంలోకి దిగి తప్పులను సరిదిద్దుకుంటూ కొత్త ఆలోచనలతో, సరికొత్త పద్ధతులతో ముందుకు సాగుతారు. నవీకరణ కొరత నుంచి పుడుతుందే తప్ప సమృద్ధి నుంచి పుట్టదని నిరూపిస్తారు. బీవైడీ తదితర సంస్థలు ఈ పంథాలోనే ముందుకుసాగి ప్రపంచ దిగ్గజాలుగా వెలుగుతున్నాయి. పోటీ తీవ్రంగా ఉండి, పరిస్థితులు మారిపోయే అస్థిర మార్కెట్‌లో మనుగడ సాగించాలంటే, వైఫల్యం ఎదురయ్యే లోపే సరైన పాఠాలు నేర్చుకుంటూ, విజయం వైపు దూసుకెళ్లాలి. ఈ నేర్పు శిక్షణ ద్వారా మాత్రమే సిద్ధించదు. ఎదుటివారి అత్యుత్తమ నిర్వహణ పద్ధతులను గమనిస్తూ, నిరంతర అభ్యాసంపై మక్కువతో పురోగమించడం ద్వారా మాత్రమే ఒంటబడుతుంది. అనుభవాన్ని, దాని నుంచి నేర్చుకున్న పాఠాలను సంస్థలో అంతర్గత జ్ఞానంగా మార్చి, సిబ్బందితో పంచుకోవడం ద్వారానే అలీబాబా వంటి కంపెనీలు ప్రపంచంలో మేటిగా ఎదిగాయి. ఎప్పటికప్పుడు మారిపోయే అస్థిర మార్కెట్లలో భవిష్యత్తును అంచనా వేయడంకన్నా వేగంగా స్పందించగల, పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యానికే విజయం లభిస్తుంది. వ్యవస్థాపకులు వేగంగా తీసుకునే నిర్ణయాలు, వనరులను అవసరమైన చోటికి తక్షణం మళ్లించే విధానాలే వ్యాపార విజయానికి కీలకాలు. షావొమీ తన కొత్త మోడళ్లను నెలల వ్యవధిలోనే విడుదల చేస్తుంటుంది. విజయవంతమైన మోడళ్లనూ అదే పనిగా కొనసాగించదు. వ్యాపార వ్యూహమనేది సజీవ నిరంతర ప్రవాహమనే సూత్రమే షావొమీ విజయానికి మూలం. చైనా కంపెనీలు అనునిత్యం అభివృద్ధినే జపిస్తాయి, పరితపిస్తాయి. నిరంతర ప్రగతి లేనిదే మనుగడే లేదన్నట్లుగా వ్యవహరిస్తాయి. వ్యాపారంలో ఎంత ఎత్తుకు ఎదిగితే అంతగా పోటీ నుంచి రక్షణ లభిస్తుందని, ప్రభుత్వ విధానాల్లో మార్పులను తట్టుకునే సత్తా లభిస్తుందని భావిస్తాయి. అందుకే వినియోగదారుల సంఖ్యను పెంచుకోవడానికి, కొత్త మార్కెట్లలోకి విస్తరించడానికి అహోరాత్రులు శ్రమిస్తాయి. అంతర్జాతీయీకరణను రక్షాకవచంగా భావిస్తూ ఎదుగుతాయి. బయటి ప్రపంచంలో పోటీ, సర్కారీ విధానాల్లో మార్పులు, అనూహ్య పరిస్థితులు సర్వసాధారణం. ఇలాంటి అస్థిరతను ఏ కంపెనీ అయినా బలమైన అంతర్గత సంస్కృతితోనే అధిగమించగలదు. లోతైన క్రమశిక్షణ కంపెనీ సంస్కృతిలో విడదీయరాని భాగం కావాలి. నిర్వహణా పద్ధతుల్లో లోపాలున్నా క్రమశిక్షణతో వాటిని అధిగమించి ముందుకు సాగవచ్చు. వ్యాపారమంటే అమ్మడం, కొనడంతో ముగిసిపోయే లావాదేవీల సంస్కృతి కాదని, అంతకు మించినదని గ్రహించాలి. అగ్రశ్రేణి చైనా కంపెనీలు ఈ గ్రహింపుతోనే దినదినాభివృద్ధి చెందుతున్నాయి.

### వేగంగా కార్యనిర్వహణ

చైనాలో రాజకీయాల మాదిరిగానే వ్యాపారాలూ అగ్ర నాయకుడు(బిగ్‌బాస్), అంటే వ్యవస్థాపకుడి ఆధ్వర్యంలో నడుస్తాయి. నాయకుడంటే కేవలం అలంకారప్రాయంగా పదవిలో ఉండే వ్యక్తి కాదు. ప్రతి సాహసోపేతమైన నిర్ణయానికీ వ్యవస్థాపకుడే బాధ్యుడు. ఆ నిర్ణయాన్ని చురుగ్గా ఆచరణలో పెట్టే క్రియాశీల రూపశిల్పి కూడా. పాశ్చాత్య దేశాలకు ఇది నిరంకుశ కార్యశైలిగా కనిపించవచ్చు. కానీ, బిగ్‌బాస్ వ్యవస్థ అద్భుతమైన వేగంతో కార్యనిర్వహణ సాధిస్తుంది. వనరుల సమీకరణకు సమర్థ మార్గదర్శిగా పనిచేస్తుంది. అలాగని నాయకుడే అన్నీ చేయాలని కాదు, వ్యాపారాన్ని విస్తరించడానికి వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఎప్పుడు, ఎలా నియోగించాలో కూడా ఉత్తమ నాయకులకు బాగా తెలుసు. చివరగా, చైనాలో బుద్ధిగా నిబంధనలు పాటించినంత మాత్రాన వ్యాపారంలో విజయం దక్కదు. దాంతోపాటు బ్యాంకులు, స్థానిక అధికారులు, సరఫరాదారులతో ఉన్న సంబంధాలు, భాగస్వామ్యాల నెట్‌వర్కే కీలకం. దీని సాయంతో ఎంతటి క్లిష్ట పరిస్థితుల నుంచయినా గట్టెక్కగలుగుతారు. 'ద ఫార్చ్యూన్ మేకర్స్'లో వివరించిన విజయ సూత్రాలు కేవలం చైనాకే వర్తించే లక్షణాలు కావు. ప్రపంచంలో ఎక్కడైనాసరే వ్యాపార నిర్వహణలో అనిశ్చితిని, అస్థిరతను ఎదుర్కొనే ఏ నాయకుడికైనా మార్గదర్శిలా పనికొస్తాయి. కేవలం అధిక వనరులు లేదా పరిపూర్ణమైన సంస్థలు ఉన్నంత మాత్రాన విజయం లభించదు. మన చుట్టూ ఉన్నవారికన్నా వేగంగా మార్పుచేర్పులకు స్పందించే మనస్తత్వాన్ని అలవర్చుకోవడమే విజయానికి దగ్గరి దారి

# మావోయిస్టులకు స్వాగతం






సాయుధపోరుకు స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి వస్తున్న మావోయిస్టులకు స్వాగతం. ఆధునిక ప్రపంచంలో ఎక్కడా సాయుధపోరాటాలకు, విముక్తి ఉద్యమాలకు చోటు లేదు. ఆయా దేశాల్లోని సమకాలీన రాజకీయ స్థితిగతులే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆలస్యంగానైనా భారత మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సాయుధ పోరుకు స్వస్తి పలికి సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు రావటం వారి వారి కుటుంబాలకు, దేశానికి శుభపరిణామం. ఆలస్యంగానైనా హింసను విడనాడి, వాస్తవిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవటం, ప్రజాస్వామ్య పంథాను స్వీకరించటం సరైన నిర్ణయం. పీపుల్స్ వార్, మావోయిజం పేరుతో 50 ఏళ్లుగా యువత అడవుల బాట పట్టింది. పోలీసులు, ఉద్యమకారులు వేలాది మంది ఈ సంఘర్షణలో ప్రాణాలు కోల్పోయారు.

### దేశం కోల్పోయిన మేధస్సు

వేలాది కుటుంబాలు కుటుంబ పెద్దను కోల్పోయి రోడ్డున పడ్డాయి. ఎంతో మంది తల్లుల కడుపుకోత వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. అతివాద వామపక్ష ఉద్యమాల బాధితులు లక్షల్లోనే ఉంటారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయిలో ఎంతో మంది రాజకీయ నాయకత్వం ప్రాణాలు కోల్పోయింది. ఫలితంగా ఎంతో భవిష్యత్తు, మేధస్సు కలిగిన యువతను భారత దేశం కోల్పోయింది. తద్వారా నవభారత నిర్మాణం ఆలస్యమవుతూ వచ్చింది. మావోయిజానికి ప్రస్తుతం ముగింపు సమయం. సిద్ధాంత వైరుధ్యాలున్నప్పటికీ మావోయిస్టుల మేధస్సు ఈ దేశ నిర్మాణానికి అవసరం. అయితే భారతీయ మూలాలను అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా వారి మేధస్సును నవభారత నిర్మాణానికి తోడ్పాటునందించాల్సి ఉంటుంది. వేగవంతమైన నేషన్ బిల్డింగ్‌కు మావోయిజం వంటి సాయుధ పోరాట సిద్ధాంతాలకు చోటే లేదు.

### దేశం మరిచిపోలేని గాయాలు

దశాబ్దాలుగా మావోయిస్టుల పేరుతో జరిగిన హింస, అరణ్యాలలో నిష్కల్మషంగా జీవించే ఆదివాసీల రక్తపాతం.. ఇవి ఈ దేశం మరిచిపోలేని గాయాలు. కానీ ఆ గాయాలు మానుతున్నాయి. పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడుతున్నామనే ముసుగులో అడవులను తమ రాజ్యంగా మార్చుకున్న మావోయిస్టులు, చివరికి అమాయక యువతను తుపాకీ దారి పట్టించి మరణాలకు కారణమయ్యారు. గత యైబై ఏళ్లలో వేలాది ఆదివాసి, దళిత, బహుజన యువత మావోయిజం అనే మాయలోపడి అకాల మరణం చెందారు. ఈ రక్తపాతం ఎవరి కోసం ఏ సిద్ధాంతం కోసం ఎవరి భవిష్యత్తు కోసం.. అధునాతన యుగంలో సాయుధ పోరాటం ఏ సమస్యకూ సమాధానం కాదు. అభివృద్ధి కావాలంటే తుపాకీలు కాదు.. పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, మార్కెట్లు, ఇన్నోవేషన్ సెంటర్లు కావాలి. మావోయిజం ఇవేవీ ఇవ్వలేదు. పైగా దేశాన్ని దశాబ్దాల వెనక్కి లాక్కెళ్లింది. మావోయిస్టు కార్యకలాపాలు దాదాపుగా కనుమరుగయ్యే దశకు చేరుకోవటం మంచిదే. ఏ సిద్ధాంతమైన కాలంతో పాటు మారాలి. సమకాలీన పరిస్థితులను అవలోకనం చేసుకోవాలి. అందుకు అనుగుణంగా మనం తీసుకునే నిర్ణయాలు సమాజానికి మేలు చేకూర్చేలా ఉండాలి. వందేళ్ల క్రితం, యాభై ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవు. కూడు, గూడు, గుడ్డ నినాదాలు ప్రస్తుతం జనబాహుళ్యంలో లేనే లేవు. ఆశించిన దానికన్నా ఎన్నో రెట్లు ప్రజల జీవితాల్లో మార్పులు వచ్చాయి. మెజార్టీ ప్రజలు సంతృప్త జీవితాన్ని గడుపుతున్నారు. ఇంకా కొంత వెనకబాటు అక్కడక్కడా ఉన్నా.... వారి భద్రత, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నాయి. ఓ స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఈ దేశంలోని పౌరులంతా గౌరవంగా, గర్వంగా బతికేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది. ప్రస్తుతం దేశంలోని పరిస్థితులే అందుకు ఉదాహరణ.

### మావోయిస్టుల భాగస్వామ్యం

మరింత అభివృద్ధి కోసం మావోయిస్టులూ ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేయాలి. ఏ సిద్ధాంతమైనా కాలంతోపాటు మారాల్సిందే. మావోయిస్టు రహిత భారత్ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ప్రణాళికలు విజయం సాధించాయి. హార్ట్ అండ్ మైండ్ స్ట్రాటజీ ద్వారా గ్రామస్తుల విశ్వాసాన్ని పొందడం, వారికి అభివృద్ధి ప్రయోజనాలు అందించటం తద్వారా మావోయిస్టులు కల్పించిన భయాన్ని తొలగించడంలో విజయం సాధించాయి. అడవిలో మొదటిసారి వచ్చిన మొబైల్ నెట్‌వర్క్, గ్రామంలో మొదటిసారి వచ్చిన రహదారి, మొదటిసారి వచ్చిన వైద్య శిబిరండ ఇవన్నీ గ్రామస్తుల జీవితాన్ని మార్చాయి. గ్రామాల్లో విద్య, వైద్యం, నీరు, రహదారులు, ఉచిత గ్యాస్, డిజిటల్ కనెక్టివిటీ... అన్నీ కలిసి ఒక నూతన ఆత్మవిశ్వాసాన్ని సృష్టించాయి. ఈ మార్పులన్నీ మావోయిస్టు విముక్త భారత్ కు బాటలు వేశాయి. ఇక త్వరలోనే మావోయిస్టు విముక్త భారత్ దిశగా భారత్ నిలబడటం ఖాయం.

### ప్రజాస్వామ్య వికాసం

భారతదేశం నేడు ప్రపంచానికి మార్గదర్శకంగా దిశగా ఎదుగుతోంది. అంతరిక్ష పరిశోధనా సాంకేతికత, డిజిటల్ పాలన, గ్రామీణ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, స్టార్టప్ ఎకోసిస్టమ్, సహా ప్రతి అంశంలోనూ మూడు రంగుల జెండా రెపరెపలాడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేగాన్ని అడ్డుకునే శక్తులు ఎప్పటికీ ఓడిపోతూనే ఉంటాయి. ఇకపై మావోయిజం కాదు... అభివృద్ధి చరిత్ర రాయబోతుంది. అసహజ హింస కాదు... ప్రజాస్వామ్య వికాసమే దేశాన్ని ముందుకు నడపబోతుంది. స్వర్ణయుగం కేవలం కళ కాదు. సనాతన మూలాలున్న ఆధునిక భారతదేశం దాన్ని ఆహ్వానిస్తోంది. అదే నూతన భారతం. అదే మోదీ యుగం., అదే ప్రజల ఆశయం. ఈ దారిలో ఎదురయ్యే ప్రతి అడ్డంకీ... చరిత్ర కాలగర్భంలో కలిసిపోవాల్సిందే.

# మూసీ అందాలా.. రియల్టీ దందాలా!

**కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాకోరుగా మారిపోయింది. మూసీ పరివాహక ప్రాంతాల్లోని జనావాసాలపై కన్నేసింది. సర్వేలు, తాఖీదులు,**



కూల్చివేతలు, స్వాధీనాల పేరుతో హైదరాబాద్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, హిల్ట్ పాలసీ,గాంధీ సరోవర్‌ డ పేరు ఏదైనా ఆ పథకాల వెనుక ప్రభుత్వ పెద్దల రియల్ ఎస్టేట్ దందా దాగి ఉన్నదనే అనుమానాలు బలపడుతున్నాయి. కాంగ్రెస్ పాలకులు రాష్ట్ర ఆదాయాన్ని పెంచాల్సిన మార్గాలు అన్వేషించకుండా ప్రభుత్వ భూములను ఎడాపెడా వేలం వేయడం నిత్యకృత్యమైపోయింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను రాత్రికి రాత్రి కబళించాలని చూసిన ప్రభుత్వ పెద్దలు, హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గక తప్పలేదు. ఇక ఫార్మాసిటీకి సేకరించిన 14 వేల ఎకరాల భూమిని ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చేసింది. పారిశ్రామిక వాడల భూముల కోసం హిల్ట్ పాలసీ తెచ్చింది. ఇప్పుడు గాంధీ సరోవర్ పేరుతో మరో కొత్త ప్రాజెక్టును ప్రజల ముందుకు తీసుకొచ్చింది. మూసీ నది అందంగా ఉండాలని, కాలుష్యం, దుర్వాసన లేని నదీ జలాలు నిరంతరం ప్రవహించాలని అందరికీ ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం సుందరీకరణకు ముందు చేపట్టవలసిన పనులు ఎన్నో ఉన్నాయి. మూసీ నీటిని శుద్ధి చేయడానికి అవసరమైన ప్లాంట్లు నెలకొల్పాలి. పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు, వ్యర్థాలు, డ్రైనేజీ కలవకుండా నియంత్రించాలి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను గోదావరి నీళ్లతో నింపి ఏడాది పొడవునా ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాలి. ఒకవేళ మురికివాడల్లో నివసించే ప్రజలను ఖాళీ చేయించాల్సి వస్తే, వారికి ఆమోదయోగ్యమైన, ప్రత్యామ్నాయ గృహ సౌకర్యాన్ని కల్పించాలి. ఆ తర్వాత మాత్రమే ప్రభుత్వం అడుగు ముందుకేయాలి. కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించింది. నదీ జలాల శుద్ధి కోసం 38 సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను పూర్తిచేసి, మరో 94 ప్లాంట్ల పనులను 80 శాతం పూర్తి చేసింది. కొండపోచమ్మ సాగర్ నుంచి 30 టీఎంసీల నీళ్లను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు తరలించే ప్రణాళిక రూపొందించింది. మూసీకి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూముల్లో సుందరీకరణ పనులు చేపట్టింది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నది. కానీ అందుకు భిన్నంగా ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నది. భూములు ఇస్తారా చస్తారా అన్నట్టు వ్యవహరిస్తున్నది. నదీ గమన వైశాల్యాన్ని గుర్తించి స్థిరీకరించకుండా సంబంధం లేని దూరప్రాంతాల్లోనూ సర్వే నిర్వహిస్తున్నది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ అంశంపై మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు 15 టీఎంసీలు, మూసీ ప్రక్షాళనకు 5 టీఎంసీల గోదావరి జలాలు తరలిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ జలాలు కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన కొండపోచమ్మ సాగర్ నుంచి తరలిస్తున్న విషయాన్ని మాత్రం దాచి పెట్టారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ మొదలుకొని కరెంట్, నల్లా, రోడ్డు, డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ వంటి అనుమతులతో దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజలపై కాంగ్రెస్ సర్కార్ హైడ్రాను ఉసిగొల్పడం తప్ప ఉభయ తారకమైన పరిష్కారాన్ని ఏనాడూ ఆలోచించలేదు. హైడ్రా చర్యలపై న్యాయస్థానాలు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా, ఆగ్రహం వ్యక్తం చేసినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం బాధాకరం. కాంగ్రెస్ పాలకులు రాష్ట్ర ఆదాయాన్ని పెంచాల్సిన మార్గాలు అన్వేషించకుండా ప్రభుత్వ భూములను ఎడాపెడా వేలం వేయడం నిత్యకృత్యమైపోయింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను రాత్రికి రాత్రి కబళించాలని చూసిన ప్రభుత్వ పెద్దలు, హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గక తప్పలేదు. ఇక ఫార్మాసిటీకి సేకరించిన 14 వేల ఎకరాల భూమిని ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చేసింది. పారిశ్రామికవాడల భూముల కోసం హిల్ట్ పాలసీ తెచ్చింది. ఇప్పుడు గాంధీ సరోవర్ పేరుతో మరో కొత్త ప్రాజెక్టును ప్రజల ముందుకు తీసుకొచ్చింది. హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ ప్రాంతంలో ఉన్న బాపూఘాట్ వద్ద ఈసీ, మూసీ నదులు కలిసే చోట గాంధీజీ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అక్కడికి ఎగువన మూసీ, ఈసీ నదులపై నిర్మించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వరకు మధ్య గల 21 కిలోమీటర్ల నదుల పరీవాహక ప్రాంతాలను కలిపి గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ మేరకు అక్కడక్కడ ఉన్న రక్షణ శాఖ భూములు అప్పగించాలని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. వాస్తవానికి బాపూఘాట్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వరకు ఉన్న ముక్కోణ ప్రాంత మధ్య భూములన్నీ అత్యంత విలువైనవే. ఆ ప్రాంతాల్లో గజం ధర లక్షల్లో ఉంటుంది. ప్రభుత్వ భూములను వేలం వేసిన క్రమంలో ఆ ప్రాంతాల్లో ఎకరా వంద నుంచి రూ.200 కోట్ల వరకు పలికింది. ఆ వేలం పాటలో పలికిన ధరలో పోల్చుకున్నప్పుడు ప్రభుత్వం తమ భూములకు మాత్రం నామమాత్రపు పరిహారం విలువ కట్టడం అన్యాయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆకాంక్ష



# నిరుపేద వృద్ధ వ్యవసాయ కూలీకి మానవతా చేయూత...

## హెడ్ కానిస్టేబుల్ సుకుమార్ కృషితో మూడు చక్రాల సైకిల్ అందజేత...





వెల్దుర్తి//మార్చి 10 (ఆకాంక్ష) : కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధ వ్యవసాయ కూలీ నాగయ్యకు మానవతా పరమైన సహాయం అందించి కొత్త ఆశను నింపిన ఘటన స్థానికంగా హృదయాలను కదిలించింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 63 సంవత్సరాల నాగయ్య కొంతకాలం క్రితం కూలీ పనిలో ఉండగా ఎడమ కాలిలో గాజు పెంకు లోతుగా దిగడంతో తీవ్ర గాయం అయ్యింది. సరైన వైద్యం అందక ఆ గాయం సెప్టిక్‌గా మారి పరిస్థితి విషమించడంతో వైద్యులు అతని ఎడమ కాలును పిక్కల వరకు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంఘటనతో నాగయ్య గత సంవత్సరం నుంచి తీవ్ర శారీరక, మానసిక వేదనలో జీవనం సాగిస్తూ ఎటువంటి పనులు చేసుకోలేని స్థితికి చేరుకున్నాడు. జీవనోపాధి లేకపోవడంతో పాటు కదలికలకే ఇబ్బంది పడుతూ పూర్తిగా నిరాశలోకి జారిపోయాడు. ఈ పరిస్థితిని గమనించిన హెడ్ కానిస్టేబుల్ రేపల్లె మాస్టర్ సుకుమార్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి నాగయ్య పరిస్థితిని పలువురు సేవా సంస్థలకు వివరించారు. ఆయన చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా కర్నూలుకు చెందిన శ్రీ పతాంజలి సాయినాథ్ యోగ సేవా ట్రస్ట్ స్పందించి నాగయ్యకు సహాయం చేయడానికి ముందుకొచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగయ్యకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. ఈ సైకిల్ ద్వారా నాగయ్య స్వయంగా కదలికలు చేసుకునే అవకాశం కలిగి తన రోజువారీ పనులను కొంతవరకు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలో బాధలో ఉన్నవారిని గుర్తించి వారికి సహాయం అందించేందుకు ముందుకు రావడం నిజమైన సేవ అని పేర్కొన్నారు. ముఖ్యంగా నాగయ్య పరిస్థితిని గమనించి, అతనికి సహాయం అందేలా నిరంతరం కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ సుకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పేదలు, బలహీన వర్గాల పట్ల మానవతా దృక్పథంతో స్పందిస్తూ సేవాభావాన్ని చాటుతున్న సుకుమార్ వంటి పోలీసు అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసించారు. అలాగే సేవా కార్యక్రమాలతో ముందుకు వస్తున్న శ్రీ పతాంజలి సాయినాథ్ యోగ సేవా ట్రస్ట్ సభ్యుల సేవలను కూడా కొనియాడారు. ఈ కార్యక్రమం మానవత్వం ఇంకా సమాజంలో జీవించి ఉందనే సందేశాన్ని అందరికీ గుర్తు చేసింది.

# చికిత్స పొందుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి...



ఓదెల//మార్చి 10 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంపుల గ్రామానికి చెందిన కోలపురి రమేష్ తన అన్న కోలపురి శ్రీనివాస్ (38) మరణంపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయవని తెలిపారు. అయినప్పటికీ గ్రామంలోనే ఉంటూ కుటుంబ సభ్యులతో జీవనం కొనసాగించేవాడని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ ఆదివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో గుంపుల గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెళ్లి కార్యక్రమానికి శ్రీనివాస్ వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై దేకుతూ వస్తుండగా ఫంక్షన్ హాల్ సమీపంలోని బీటీ రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన శ్రీపతి బిక్షపతి తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి శ్రీనివాస్‌ను ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ వీపు భాగంలో, చేతులు మరియు కాళ్లపై తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడ చికిత్స అనంతరం మరుసటి రోజు మరో ఆసుపత్రికి తరలించేందుకు ఇంటికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఈ నెల 10వ తేదీ ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు లేపగా అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై కోలపురి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతమైన

# లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు...



పెద్దపల్లిటౌన్//మార్చి 10 (ఆకాంక్ష) : పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలతో లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. తాజాగా ముగ్గురు రోగులకు నిర్వహించిన శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. బొంపల్లి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల మహిళ తీవ్ర కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో గాల్ బ్లాడర్ నెక్‌లో రాయి (స్టోన్) ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా మంచిర్యాల జిల్లాకు చెందిన 40 సంవత్సరాల వ్యక్తి కూడా కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ నెల రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చారు. పరీక్షల్లో గాల్ బ్లాడర్ నెక్‌లో రాయి మరియు ఇన్ఫెక్షన్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఇన్ఫెక్షన్ తగ్గేందుకు మూడు వారాల పాటు మందులు ఇవ్వగా, అనంతరం ఇద్దరికీ ఆధునిక పద్ధతిలో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అదే విధంగా పెద్దపల్లికి చెందిన 33 సంవత్సరాల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రిని ఆశ్రయించారు. పరీక్షల్లో ఆమెకు గర్భాశయం రెండు భాగాలుగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అందులో ఒక భాగంలో మరియు సంబంధిత గర్భాశయ నాళంలో ఎండోమెట్రియోసిస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించడంతో చెడిపోయిన భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ శస్త్రచికిత్సల్లో లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమరసింహా రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ స్వాతి, డాక్టర్ రామమణి, డాక్టర్ భవాని పాల్గొన్నారు. ఈ మూడు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం సేవలు, 2డి ఎకో పరీక్షలు, ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ వంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులు లేదా వారి బంధువులు ఉన్న సమయంలో సానిటేషన్, వాష్‌రూమ్ శుభ్రత లేదా ఇతర సేవల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగినా వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు. అవసరమైతే ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో కూడా ఇవ్వవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు పూర్తిగా ఉచితమని, ఎవరికి లంచం ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత...

## వెల్దుర్తి మేజర్ పంచాయతీ అభివృద్ధి అధికారి...



వెల్దుర్తి//మార్చి 10 (ఆకాంక్ష) : వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి (ఈఓ) సందర్శించి కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని మౌలిక వసతులు, రికార్డులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సందర్శనలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భవన మరమ్మతులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం వంటి సమస్యలను కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించిన అధికారి వారికి అందుతున్న విద్యా బోధనను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యానికి ఎటువంటి రాజీ పడకూడదని, కేంద్రాల్లో పారిశుద్ధ్యాన్ని కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందో లేదో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా

# మారి వినూత్న కార్యక్రమం...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 10 (ఆకాంక్ష) :నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించిన వినూత్న కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలను అలంకరించి ఉత్సాహభరిత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిని మిద్దె నిహారిక జిల్లా కలెక్టర్ పాత్రలో, సాయి శ్రీ డీఈవోగా, కొత్తూరు ఇందు ఎంఈఓగా, దేవరకొండ మధు హెడ్‌మాస్టర్‌గా వ్యవహరించారు. విద్యార్థులు తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమానికి కారుకొండ సర్పంచ్ ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల ఎంఈఓ రఘునందన్ శర్మ, పాలెం జిహెచ్ఎం సయ్యద్ మొయినుద్దీన్ విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణతో పాటు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, భారతి, చెన్నమ్మ, ఇంద్రాణి, లావణ్య, తాతల్లి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా భావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగకరమని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామ ప్రజల సమక్షంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భారతీయులపై పడనీయవద్దు: మంత్రులకు ప్రధాని మోదీ దిశానిర్దేశం

ఇరాన్ ఎం అమెరికా, ఇజ్రాయెల్ వార్ ఎఫెక్ట్ - భారీగా పెరుగుతున్న పెట్రోలియం ఉత్పత్తుల ధరలు- వాటి ప్రభావం భారతీయులపై పడకుండా చూడాలని మంత్రులకు ప్రధాని మోదీ ఆదేశం పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు మంగళవారం కీలక సూచనలు చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు, సరఫరాలపై పడే ప్రభావం నుంచి భారతీయులకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర మంత్రులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇరాన్ పై అమెరికా,

# మిడ్జిల్ మండలంలో ట్రాక్టర్ చోరీ...



జడ్చర్ల//మార్చి 10 (ఆకాంక్ష) :నారాయణపేట్ జిల్లా మిడ్జిల్ మండలంలో ట్రాక్టర్ చోరీ ఘటన చోటుచేసుకోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మిడ్జిల్ గ్రామానికి చెందిన రైతు రాములు ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. రాములు సోమవారం సాయంత్రం రోజులాగే తన పొలంలో పనిచేసి ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వెళ్లాడు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో తిరిగి పొలానికి వెళ్లి చూడగా అక్కడ నిలిపి ఉంచిన ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను చోరీ చేసి ఎత్తుకెళ్లినట్లు భావించిన రైతు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో మిడ్జిల్ మండలంలోనే రెండు ట్రాక్టర్లు దొంగలు చోరీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వరుసగా ట్రాక్టర్ చోరీలు జరుగుతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగలను త్వరగా పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పశువులకు ఉచిత గాలికుంటు

# నివారణ టీకాల కార్యక్రమం నిర్వహణ...



జడ్చర్ల//మార్చి 10 (ఆకాంక్ష) : మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి, వేముల, వాడ్యాల, అయ్యవారిపల్లి గ్రామాలలో పాడి పశువుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు (ఎఫ్ఎమ్‌డీ) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు నెలలు నిండిన ప్రతి పశువుకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందించారు. పాడి పశువులు మరియు దుక్కి దున్నే పశువులకు టీకాలు వేస్తూ రైతులకు వ్యాధి గురించి అవగాహన కల్పించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం రావడంతో పాటు పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, పని సామర్థ్యం కూడా తగ్గిపోతుందని పశువైద్య అధికారులు తెలిపారు. అదే విధంగా పశువుల నోరు మరియు గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి అవి పుండ్లుగా మారడం వల్ల తీవ్రమైన నొప్పి కలిగి పశువులు మేత మరియు నీరు తీసుకోలేక చివరకు ప్రాణాపాయం కలగవచ్చని వివరించారు. ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు మూడు నెలల వయస్సు దాటిన దూడలు మరియు పెద్ద పశువులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిరోధక టీకాలు వేయించడం తప్పనిసరి అని సూచించారు. రైతులు తమ పశువులను సమీప టీకా కేంద్రాలకు తీసుకువచ్చి టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోలు మంగమ్మ శ్రీనివాసులు, పాడి రైతులు తిరుపతయ్య, రాజు, శివ, పశువైద్య సిబ్బంది నర్సింలు, పాండు, గోపాలమిత్రలు యాదగిరి, వేణుగోపాల్, రామకృష్ణ పాల్గొన్నారు. మిడ్జిల్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, టీకాలు వేయించడం ద్వారా గాలికుంటు వ్యాధిని సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు.

# మీలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా - అయితే "కడుపు క్యాన్సర్" కావొచ్చట!

## విస్తరిస్తున్న కడుపు క్యాన్సర్ - లక్షణాలు వెల్లడించిన నిపుణులు



ఎసిడిటీ, గ్యాస్ బాధల్ని మనం చాలాసార్లు పెద్దగా పట్టించుకోము. ఏదో ఒక యాంటాసిడ్ మాత్ర వేసుకుంటాము. అయితే, ఇవే బాధలు దీర్ఘకాలికంగా కొనసాగుతుండటం, వీటికి తోడు తరచూ పొట్టలో నొప్పి, బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తుంటే నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు నిపుణులు. ఇలాంటి లక్షణాల వెనుక ఒక్కోసారి ప్రమాదకర క్యాన్సర్లు దాగి ఉండే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో కడుపు క్యాన్సర్ సూచించే హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

కడుపు క్యాన్సర్ ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. కడుపులో క్యాన్సర్ కణాలు పెరగడం ప్రారంభించినప్పుడు ఇది సంభవిస్తుంది. ఇది కడుపులోని ఏ భాగంలోనైనా రావచ్చు. అయితే, చాలా సందర్భాలలో, కడుపు ప్రధాన భాగంలో ఇది కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ వ్యాధి సాధారణంగా నెమ్మదిగా మొదలవుతాయి. దీని ప్రారంభ సంకేతాలు ఎసిడిటీ, అజీర్ణం లేదా అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పి వంటి సాధారణ జీర్ణక్రియ సమస్యలను పోలి ఉండటం వల్ల దీనిని గుర్తించడం చాలా కష్టం. అయితే, హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయంటున్నారు నిపుణులు.

నిరంతర అజీర్ణం :

ఉదర పై భాగంలో స్వల్పంగా ఎసిడిటీ లేదా మంట కలగడం సాధారణం. అయితే, ఇది పదేపదే లేదా నిరంతరం వస్తున్నప్పుడు, అది కడుపు క్యాన్సర్ సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సాధారణంగా మంట లేదా అసౌకర్యమనేది బొడ్డు పైన అనిపిస్తుందట. సాధారణ యాంటాసిడ్లు లేదా జీవనశైలి మార్పులతో ఇది తగ్గకపోవచ్చట. ఎటువంటి స్పష్టమైన కారణం లేనప్పటికీ, ఈ రకమైన అజీర్ణం వారాల పాటు లేదా నెలల తరబడి మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది.

కడుపు నిండినట్లు అనిపించడం :

తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకున్నప్పటికీ, కడుపు నిండినట్లు అనిపిస్తుందని అష్ట్రం.బని అధ్యయనం పేర్కొంది. కడుపు విపరీతంగా నిండిపోయినట్లు, బిగుతుగా లేదా బరువుగా అనిపించడం వల్ల వ్యక్తి భోజనం మధ్యలోనే తినడం ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. కడుపు పై భాగం లేదా మధ్య భాగంలో గడ్డ పెరగడం వల్ల ఇలా అనిపిస్తుందని చెబుతున్నారు. కారణం లేకుండా బరువు తగ్గడం : డైటింగ్ లేదా వ్యాయామం చేయకుండానే బరువు తగ్గడం ఆందోళకరమైన విషయం. కడుపు క్యాన్సర్ లో గడ్డలు అనేవి జీర్ణక్రియకు, పోషకాల శోషణకు అడ్డుపడటం వల్ల క్రమంగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇది ఆకలిని కూడా తగ్గిస్తుందట. దీనివల్ల వ్యక్తి తక్కువగా తినొచ్చు. శరీరం క్యాలరీలను, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేకపోవచ్చుట. ఇది శరీరం కృశించిపోవడానికి, బలహీనతకు, కండరాల క్షీణతకు దారితీస్తుందట.

నిరంతర కడుపు నొప్పి లేదా అసౌకర్యం :

కడుపు పైభాగంలో మొండిగా, నిరంతరంగా వచ్చే నొప్పి లేదా అసౌకర్యం మరొక ముఖ్యమైన సంకేతమని ఎవ్వితీష్ట్రముశ్రీష్ట్ర.జఅఎ.స్త్రశీజ. అధ్యయనం పేర్కొంది. తిన్న ఆహారం సరిపడక అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పిలా కాకుండా, ఈ నొప్పి తగ్గకుండా వస్తుందట. అలాగే, కాలక్రమేణా నెమ్మదిగా తీవ్రమవుతుందట. ఇది సాధారణంగా బొడ్డుకు సరిగ్గా పై భాగంలో అనిపిస్తుందని చెబుతున్నారు. ఈ నొప్పి గడ్డ వల్ల గానీ, కడుపు లోపలి పొరపై పుండ్లు ఏర్పడటం వల్ల గానీ లేదా సమీపంలోని ఇతర అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల గానీ రావచ్చు. కొన్నిసార్లు ఈ నొప్పి రాత్రి సమయాల్లో లేదా భోజనం చేసిన తర్వాత మరింత ఎక్కువగా అనిపిస్తుందట.

వికారం, వాంతులు :

తరచుగా వికారం అనిపించడం లేదా భోజనం చేసిన తర్వాత పదేపదే వాంతులు కావడం కడుపులో సమస్య ఉన్నదనడానికి సంకేతం కావచ్చని అధ్యయనం పేర్కొంది. కడుపు క్యాన్సర్ ఉన్న కొన్ని సందర్భాల్లో, గడ్డ ఉదర ద్వారం వద్ద అడ్డుపడటం వల్ల పదేపదే వాంతులు అవుతాయని చెబుతున్నారు నల్లటి లేదా తారు రంగు మల విసర్జన లేదా మలంలో రక్తం : నల్లగా, తారు రంగులో ఉండే మలం అనేది కడుపుతో సహా జీర్ణవ్యవస్థ పైభాగంలో రక్తస్రావం జరుగుతోందనడానికి సంకేతమంటున్నారు నిపుణులు. రక్తం ప్రేగుల గుండా ప్రయాణించేటప్పుడు నల్లగా మారుతుంది, ఇది కడుపులోని గడ్డ వల్ల కలిగే పుండును సూచిస్తుంది. కొన్నిసార్లు ఈ రక్తస్రావం చాలా నెమ్మదిగా జరిగి బయటకు స్పష్టంగా కనిపించకపోవచ్చు, కానీ ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీనివల్ల చర్మం పాలిపోవడం, బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. మలంలో రక్తం నేరుగా కనిపించడం కూడా ఒక ప్రమాదకరమైన హెచ్చరిక

## ఉచిత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ శ్యామనీ...



గోదావరిఖని//**మార్చి 10 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ జనగామలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఆవుల తోకల శ్యామనీ రమేష్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్యామనీ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యులను పంపించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ విధమైన వైద్య శిబిరాల ద్వారా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని ఆమె తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని సేవలు అందించారు. మహిళల ఆరోగ్య సమస్యల కోసం గైనకాలజిస్ట్, పిల్లల ఆరోగ్య సేవల కోసం పీడియాట్రిక్ వైద్యులు, కంటి సమస్యల పరిశీలన కోసం ఆప్తమాలజిస్ట్, ఎముకలు మరియు కీళ్ల సమస్యల కోసం ఆర్థోపెడిక్ వైద్యులు, దంత సమస్యల పరిష్కారం కోసం డెంటిస్ట్ వైద్యులు, అలాగే సాధారణ ఆరోగ్య సమస్యల కోసం ప్రత్యేక వైద్యులు రోగులను పరిశీలించారు. వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది ద్వారా ఉచితంగా అందజేశారు. ఒకే చోట అనేక విభాగాలకు చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు మెరుగైన చికిత్స లభించిందని కార్పొరేటర్ పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమం లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం వైద్య సేవలను నేరుగా ప్రజల వద్దకు తీసుకు వెళ్తుండటం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు.

## మార్చి13 నిరాహార దీక్షకు మద్దతు కోరిన ఎన్‌పీఆర్‌డీ...



నాగర్ కర్నూల్//**మార్చి 10 (ఆకాంక్ష) :** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మార్చి 13న నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ దివ్యాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వికలాంగుల పెన్షన్లను రూ.6000లకు పెంచాలని, రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. అలాగే పురుష దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరాహార దీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### వీధి వ్యాపారులకు షెడ్లు ఏర్పాటు చేయాలని

## కమిషనర్, ఛైర్మన్‌కు వినతి...



నాగర్‌కర్నూల్//**మార్చి 10 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వీధి వ్యాపారులు తమకు షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాపారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తా ప్రధాన రోడ్డుపై గత 30 సంవత్సరాలుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. స్థిరమైన షాపులు లేకపోవడంతో వర్షాలు, ఎండలు వంటి పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనోపాధి సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ మోరి ఎత్తు ఎక్కువగా ఉండటం వల్ల వ్యాపారాలు నిర్వహించడానికి అనుకూల పరిస్థితులు లేకపోతున్నాయని పేర్కొన్నారు. వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పొదిల రామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జూనియర్ కాలేజీ గేటు ముందు 32 షాపులు నిర్మించి పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. అయితే అంబేద్కర్ చౌరస్తాలో మిగతా షెడ్లు నిర్మించడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి డ్రైనేజీ మోరి ఎత్తు తగ్గించి, వాటి పైన చిన్న చిన్న షెడ్లు నిర్మిస్తే తమకు జీవనోపాధి కొనసాగించడానికి మార్గం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే గౌరవ ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి గారిని కలిసి తమ సమస్యను వివరించామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్, ఛైర్మన్‌లు సమస్యను పరిశీలించి డ్రైనేజీ ఎత్తు తగ్గించి వ్యాపారాలు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అంబేద్కర్ చౌరస్తాలో వీధి వ్యాపారులకు షెడ్లు నిర్మిస్తే పేదల జీవనోపాధికి పెద్ద ఊతమవుతుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు సాదిక్, రవీంద్ర, చారి, రామచంద్ర, కాజా నరసింహ, సుధాకర్, ముర్తుజా, రవి, భాస్కర్, అంజి, శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నప్రసాద పంపిణీ...



నాగర్ కర్నూల్//**మార్చి 10 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లట్టుపల్లి గ్రామానికి చెందిన పంతుల బాజీరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పి. మల్లాజీరజిని దంపతులు సత్యసాయి అన్నప్రసాద పంపిణీ కేంద్రం ద్వారా రోగి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వీకుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, దీనివల్ల వారు సంతృప్తి చెందుతారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, గర్భిణీలు, చిన్నారులు కలిపి 250 మందికి పైగా అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద కేంద్రం బాధ్యులు ఏలీమే ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం 12:30 గంటల నుండి రోగి సహాయకులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పుట్టిన రోజులు, వివాహ దినోత్సవాలు, వర్ధంతులు లేదా ఇతర సందర్భాల్లో అన్నదానం చేయదలచిన వారు నేరుగా కేంద్రాన్ని సంప్రదించవచ్చని లేదా 9441303182 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పంతుల భారతమ్మ, మనస్విని, సాత్విక, సత్యసాయి అన్నప్రసాద కార్యదర్శి ఎలిమేశ్వరయ్య, సాయి ప్రకాష్, బాలయ్య, పాండు, కృష్ణయ్య, బాలకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 13న మెగా జాబ్ మేళా నిర్వహణ...



నాగర్ కర్నూల్//**మార్చి 10 (ఆకాంక్ష) :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈనెల 13వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మదన్‌మోహన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్‌లో గల ఆర్ట్స్ కళాశాలలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల మరియు ఆర్ట్స్ కళాశాలల ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ జాబ్ మేళాలో దాదాపు పది ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను అందించనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన యువతతో పాటు ప్రస్తుతం ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో మెగా జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం జేకేసి ఇంచార్జి రామకృష్ణను 89857 47301 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త అంజయ్య, కళాశాల అధ్యాపకులు ప్రసాద్, ఇతర అధ్యాపక బృందం సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ కార్యక్రమం...




మంథని//**మార్చి 10 (ఆకాంక్ష) :** మంథని మండలం ఆరెంద గ్రామంలోని జడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదులపల్లి నరసింహారావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు జీవితంలో ఒక ముఖ్యమైన దశలోకి అడుగుపెడుతున్నారని తెలిపారు. రాబోయే పబ్లిక్ పరీక్షలను ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ధైర్యంగా రాయాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాఠాలను పునరావృతం చేసుకుంటే తప్పకుండా మంచి ఫలితాలు సాధించగలరని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే అలవాటు ఉంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.ఆర్.పి మల్లన్న మాట్లాడుతూ పదవ తరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరినప్పుడు మంచి విద్యార్థులుగా గుర్తింపు పొందాలని, కేవలం చదువు మాత్రమే కాకుండా మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, సమాజానికి ఉపయోగపడే లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు కూడా పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, సమయపాలన ఎలా పాటించాలి, ప్రశ్నాపత్రాన్ని ఎలా చదవాలి, సమాధానాలను ఎలా రాయాలి అనే విషయాలపై విలువైన సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు కూడా ఈ సందర్భంగా తమ అనుభూతులను వ్యక్తం చేశారు. పాఠశాలలో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయుల ప్రేమ, మార్గదర్శకత్వం తమ జీవితానికి ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు గుర్తుగా ఒక జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాటలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహం, ఆనందంతో నిండిపోయింది. పాఠశాలలో విద్యార్థులు పరస్పర ప్రేమాభిమానాలతో కలిసి పాల్గొని ఈ ఫేర్వెల్ కార్యక్రమంను విజయవంతం చేశారు.

## పెద్దపల్లి జిల్లా ఇదులాపూర్‌లో ప్రధాన మురికి కాలువ దుస్థితి...

### వెంటనే చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యురాలి హెచ్చరిక...




ఓదెల//**మార్చి 10 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో ప్రధాన మురికి కాలువ శుభ్రం చేయకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని 5వ వార్డులో ఉన్న ఈ కాలువలో చెత్త, పచ్చిగడ్డి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండి తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి స్థానిక ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడిందని 5వ వార్డు సభ్యురాలు బందరపు మణెమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కాలువను చాలా కాలంగా శుభ్రం చేయకపోవడంతో మురికి నీరు నిల్వ ఉండి పరిసర ప్రాంతాల్లో విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఈ పరిస్థితుల వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామ ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శి గుర్రాల రాజు, కారోబార్ గద్దం స్వామిదాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది యాలాల హరీష్‌లకు పలుమార్లు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వార్డు సభ్యురాలు ఆరోపించారు. గ్రామ సర్పంచ్ కూడా పలుమార్లు సూచించినప్పటికీ కార్యదర్శి ఈ సమస్యను పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజల ఆరోగ్యంతో అధికారులు చెలగాటం ఆడుతున్నట్లుగా ఉందని మండిపడిన బందరపు మణెమ్మ, వెంటనే కాలువను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మండల అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఈ మురికి కాలువ ఉండటంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. వెంటనే శుభ్రపరిచే చర్యలు తీసుకోక పోతే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వార్డు సభ్యురాలు హెచ్చరించారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురికి కాలువను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పెద్దపల్లి జిల్లా కొలనూరుకు ఆర్‌ఓబీ మంజూరు...

### ఓదేలకు కూడా సాధిస్తాం: ఎంపీ గడ్డం వంశీకృష్ణ...



ఓదెల//**మార్చి 10 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలోని కొలనూరు ప్రాంతానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ) మంజూరు కావడం అక్కడి ప్రజలకు ఆనందకరమైన విషయమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. కొలనూరు, ఓదెల ప్రాంతాల్లో రైల్వే గేటు కారణంగా స్థానిక ప్రజలు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యను రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ వివరించారు. రైల్వే అధికారులు కొలనూరు ప్రాంతాన్ని సందర్శించిన సమయంలో తాను స్వయంగా వారితో కలిసి పరిశీలన నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆ సందర్భంగా ఓదేల ప్రాంతానికి కూడా అత్యవసరంగా రైల్వే ఓవర్ బ్రిడ్జ్ అవసరం ఉందని అధికారులకు వివరించినట్లు చెప్పారు. ప్రారంభంలో రైల్వే శాఖ కొలనూరుకు మాత్రమే ఆర్‌ఓబీ మంజూరు చేయాలని నిర్ణయించి, ఓదేల ప్రాంతానికి సాధ్యం కాదని తెలిపిందన్నారు. అయినప్పటికీ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని తాను నిరంతరం కృషి కొనసాగించినట్లు ఎంపీ తెలిపారు. తన పట్టుదలతో చేసిన ప్రయత్నాల ఫలితంగా రైల్వే శాఖ కొలనూరు ప్రాంతంలో తమ స్వంత నిధులతో ఆర్‌ఓబీ నిర్మాణానికి అంగీకరించిందని వెల్లడించారు. కొలనూరు ప్రాంతంలో ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తయితే రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని ఆయన అభిప్రాయ పడ్డారు. స్థానిక రైతులు, విద్యార్థులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కూడా దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అదే విధంగా ఓదేల ప్రాంతానికి కూడా ఆర్‌ఓబీ మంజూరు అయ్యేలా తాను నిరంతరం కృషి కొనసాగిస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. త్వరలోనే కొలనూరు ఆర్‌ఓబీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఈ అభివృద్ధి కార్యక్రమంతో కొలనూరు గ్రామ ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు

## ఇప్పపూల సారాను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దాలి...

### మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలు...



జడ్చర్ల///**మార్చి 10 (ఆకాంక్ష) :** అడవుల్లో సహజంగా లభించే ఇప్పపూలతో తయారయ్యే సారాను ప్రపంచ స్థాయి గ్లోబల్ బ్రాండ్‌గా అభివృద్ధి చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. రసాయనాలతో తయారయ్యే కల్తీ సారా గురించి తాను మాట్లాడటం లేదని, గిరిజనులు సంప్రదాయంగా తయారు చేసే ఇప్పసారాను మాత్రమే ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నానని స్పష్టం చేశారు. మంగళవారం జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పపూల సారాకు తెలంగాణ సాంప్రదాయ మద్యంగా గుర్తింపు తీసుకురావాలని అన్నారు. ఇప్పసారా తయారీకి మన దేశంలో ఐదువేల ఏళ్ల చరిత్ర ఉందని, బ్రిటీష్ పాలన తర్వాత వారి మద్యాన్ని అమ్ముకునేందుకు సంప్రదాయ ఇప్పసారా తయారీని అణిచివేశారని పేర్కొన్నారు. గతంలో ఇప్పసారా సేవించినవారు 100 సంవత్సరాలకు పైగా ఆయుష్షుతో జీవించేవారని, ప్రస్తుతం రసాయన మద్యం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ అంశంపై విస్తృతంగా పరిశోధన చేసిన తరువాతే తాను మాట్లాడుతున్నానని చెప్పారు. విదేశాల్లో టకీలా వంటి సంప్రదాయ మద్యాల ద్వారా కొన్ని దేశాలు భారీ ఆదాయం పొందుతున్నాయని, అదే విధంగా తెలంగాణలో ఇప్పసారాను ప్రోత్సహిస్తే రాష్ట్రానికి లక్ష కోట్ల రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. అంతేకాకుండా నల్లమల అటవీ ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని అనేక అడవుల్లో విస్తారంగా లభించే ఇప్పపూల సేకరణ ద్వారా ఆదివాసీ, గిరిజనులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. రసాయనాలతో తయారు చేసే కల్తీ సారాకు తాను పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేసిన ఆయన, బెల్టుషాపుల సమస్యలను అరికట్టడంలో కొన్ని చట్టపరమైన లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఏడుకు తక్కువ బాటిళ్లు ఉన్నప్పుడు కేసు నమోదు చేయడం సాధ్యం కాకపోవడం వల్ల కొందరు ఆ లోపాన్ని ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఇప్పసారా విషయంలో లాభనష్టాలు రెండూ ఉన్నాయని, ఈ అంశంపై తాను అసెంబ్లీలో సమగ్రంగా చర్చిస్తానని తెలిపారు. తాను ఇప్పసారాను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు తప్పుడు అర్థాలు చేసుకొని ప్రభుత్వం సారా అమ్మాలని లేదా సారా దుకాణాలు తెరవాలని చెప్పినట్లు ప్రచారం చేశాయని, అందులో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పసారాను ప్రోత్సహించడం తన వ్యక్తిగత ఆలోచన మాత్రమేనని, గిరిజనులు మరియు ఆదివాసీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ అంశాన్ని ముందుకు తీసుకువస్తున్నానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ ఉద్యమం మిలియన్ మార్చ్ కు తరలి వెళ్లిన ఉద్యమకారులు...



ఓదెల///**మార్చి 10 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమకారులు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమం మిలియన్ మార్చ్ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ నేతృత్వంలో పలువురు ఉద్యమకారులు సుల్తానాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ముందుగా పెద్దపల్లి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించి "జై తెలంగాణ తెలంగాణ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దాదాపు 13 సంవత్సరాల పాటు నిరంతరంగా పోరాటం చేశామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడితే తమ జీవన పరిస్థితులు మెరుగుపడతాయని ఆశతో ఎన్నో కష్టాలు భరించి ఉద్యమాన్ని ముందుకు నడిపామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పేద మరియు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది ఉద్యమకారులు పాల్గొన్నారని, రాష్ట్ర సాధన కోసం తమ ఆర్థిక వనరులను ఖర్చు చేసి తీవ్రంగా నష్టపోయారని వారు తెలిపారు. కనీసం ఇప్పుడు అయినా ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించి ప్రత్యేకంగా ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణరావు, రామగుండం శాసన సభ్యులు మక్కన్ సింగ్, ఎంపీ వంశీ కృష్ణల నాయకత్వంలో ఈ ప్రాంత ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దొబ్బడ చంద్రకళ, నూనె రాజేశం, బింగి రాజు, మంతిని విజయ్ కుమార్, గోగుల రాజిరెడ్డి, చర్లపల్లి సురేష్ గౌడ్, ఆల శ్రీనివాస్ రెడ్డి, లలితా ఠాగూర్, కందుల అశోక్ పటేల్, జనగామ రవి, గుజ్జుల పద్మ, జ్యోతి ఠాగూర్, మద్దెల సంజీవ్, కట్ల ప్రతాప్, గోవిందుల ఎల్లస్వామి, గుర్రాల వీరేశం, పంగ రవి తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ₹1.11 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్రాల పంపిణీ...

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి...

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు...



పెద్దపల్లిటౌన్//**మార్చి 10 (ఆకాంక్ష) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తోందని, ప్రజాపాలనలో రైతులకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు తెలిపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేశారు. మొత్తం 63 మంది రైతులకు రూ.1 కోటి 11 లక్షల సబ్సిడీతో రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. రైతుల ఉత్పాదకతను పెంచడంతో పాటు వ్యవసాయ పనులు సులభతరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మేలు చేసే కార్యక్రమాలను తిరిగి ప్రారంభించామని పేర్కొన్నారు. మొత్తం 103 యూనిట్ల పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా, మొదటి విడతగా 63 యంత్రాలను రైతులకు అందజేశామని వివరించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను రైతులు ఎక్కువగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సంప్రదాయ పద్ధతులతో పాటు నూతన శాస్త్ర సాంకేతికతను ఉపయోగిస్తే దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. ముఖ్యంగా నానో యూరియా, నానో డిఏపి, నానో పొటాష్ వంటి ఆధునిక ఎరువులను ఉపయోగించడం ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందని రైతులకు సూచించారు. అలాగే రోడ్లపై కేజీ వీల్స్‌తో ప్రయాణిస్తూ రహదారులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో

## సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు...



జడ్చర్ల//**మార్చి 10 (ఆకాంక్ష) :** మిడ్జిల్ మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల విద్య హక్కుల కోసం పోరాడిన మహనీయురాలిగా సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బాలయ్య, బుచ్చయ్య, వెంకటస్వామి, బాలస్వామి, వెంకటయ్య, రమేష్, మల్లేష్, పర్వతాలు, మహేష్, ప్రభుదాసు, నారాయణ, ఎండి జహీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు హాజరయ్యారు.

# మార్చి 13న రైతుల ఖాతాల్లోకి పీఎంకిసాన్ నిధులు

## దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మందికి రూ.2 వేల చొప్పున జమ...





న్యూఢిల్లీ//మార్చి 10 (ఆకాంక్ష) : దేశవ్యాప్తంగా రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంకిసాన్ పథకం కింద మరో విడత నిధులు విడుదలకు సిద్ధమయ్యాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ఈ నెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశంలోని సుమారు 9.32 కోట్ల మంది అర్హులైన రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నేరుగా జమ చేయనున్నారు.ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరాలు వెల్లడించారు. అస్సాంలోని గువాహటి నగరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బటన్ నొక్కి ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో దేశవ్యాప్తంగా రైతులకు కలిపి సుమారు రూ.19 వేల కోట్ల నిధులు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగుకు అవసరమైన ప్రారంభ ఖర్చులను భరించేందుకు ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎంకిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకాన్ని 2019 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి కోట్లాది మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ అవుతూ వస్తున్నాయి.ఈ పథకం ప్రకారం ప్రతి సంవత్సరం అర్హులైన రైతులకు మొత్తం రూ.6 వేల ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా పంపిణీ చేస్తారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానం ద్వారా మధ్యవర్తులు లేకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ముఖ్యమైన ఆర్థిక సహాయంగా నిలుస్తోంది. సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేందుకు ఈ నిధులు ఉపయోగ పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అనేక రాష్ట్రాల్లో రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతూ సాగుకు కొంత ఆర్థిక భరోసా పొందుతున్నారు.ప్రస్తుతం విడుదల కానున్న 22వ విడతతో పీఎంకిసాన్ పథకం కింద ఇప్పటివరకు రైతులకు పంపిణీ చేసిన మొత్తం నిధులు మరింత పెరగనున్నాయి.గత విడతలలో కూడా కోట్లాది మంది రైతులకు వేల కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యాయి. పథకం పారదర్శకంగా అమలు కావడానికి రైతుల వివరాలను ఆధార్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయడం జరిగింది.ఇక రైతులు తమ పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని పీఎంకిసాన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తెలుసుకునే అవకాశం కల్పించారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పథకం ప్రయోజనం పొందని రైతులు తమ వివరాలను నమోదు చేసుకుని లబ్ధి పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు. మార్చి 13న విడుదల కానున్న ఈ నిధుల కోసం దేశవ్యాప్తంగా రైతులు ఎదురు చూస్తున్నారు. నిధులు జమ అయిన వెంటనే రైతులకు వారి బ్యాంకు ఖాతాలకు సందేశాల ద్వారా సమాచారం అందనుంది. దీంతో రైతులకు సాగు పనులకు అవసరమైన కొంత ఆర్థిక సాయం అందనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## అభివృద్ధి పథంలో రామగుండం నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తాం...

### రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్...



గోదావరిఖని//మార్చి 10 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గంలోని 8 ఇన్‌క్లైన్ కాలనీ, 15వ మరియు 19వ డివిజన్ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ హాజరై స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, రహదారుల పరిస్థితి, మౌలిక వసతుల కొరత వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నూతన తాగునీటి పంపులను ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ నీటి పంపుల ఏర్పాటు వల్ల కాలనీ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. "మన ప్రాంతాల్లో సమస్యలు వచ్చినప్పుడు కేవలం ప్రజా ప్రతినిధులను మాత్రమే ఆశ్రయించకుండా ప్రజలు కూడా ముందుకు వచ్చి అధికారులతో కలిసి పరిష్కార మార్గాలను అన్వేషిస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ప్రజల భాగస్వామ్యంతో జరిగే అభివృద్ధి మాత్రమే స్థిరమైన అభివృద్ధి అవుతుందని తెలిపారు.ప్రజల సహకారం, ప్రభుత్వ మద్దతుతో రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగ వస్తువులు తొలగించాలి...

### రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగర్వాల్....



రాజన్న సిరిసిల్ల//మార్చి 10 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, పరికరాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై కార్యాలయాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పలు శాఖల కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్ రికార్డులు, ఫైళ్లు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. కార్యాలయాల్లోని రికార్డులు, రిజిస్టర్లు సరైన విధంగా భద్రపరచాలని అధికారులకు సూచించారు. ఫైళ్లు, రిజిస్టర్లను స్టోర్ రూమ్స్‌లో క్రమబద్ధంగా అమర్చాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరం లేని పాత రికార్డులు, నిరుపయోగ వస్తువులను తొలగించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా అమలు కావాలంటే కార్యాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి జిల్లా శాఖ కార్యాలయం, మండల స్థాయి కార్యాలయాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన నిరుపయోగ వస్తువులు, పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు.అలాగే కార్యాలయాల పరిసరాలను ఆకర్షణీయంగా మార్చేందుకు అందుబాటులో ఉన్న కుండీల్లో మొక్కలు నాటాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ఉద్యోగులకు మాత్రమే కాకుండా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా మంచి అనుభూతిని కలిగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్ సత్తు అశోక్ రెడ్డి...



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామంలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని గ్రామ సర్పంచ్ సత్తు అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని తెలిపారు. గతంలో పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో భద్రతా సమస్యలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిన్న పాఠశాల అయినప్పటికీ చదువులో మండల స్థాయిలో ముందుండే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు.అనంతరం గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కల నర్సరీని సందర్శించి వివిధ రకాల మొక్కలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే వర్షాకాలంలో గ్రామంలో విస్తృతంగా పండ్ల మొక్కలను నాటేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్తుల సహకారంతో ముందుకు సాగుతున్నాయని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల సమిష్టి సహకారంతో తిమ్మక్కపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా బీఆర్ఎస్ నాయకులు...

### సీఎం సహాయనిధి ద్వారా రూ.1.5 లక్షల ఆర్థిక సాయం...



సిద్దిపేట/మార్చి 10 (ఆకాంక్ష) : సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన ఈదుగల స్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతని కుటుంబానికి అండగా నిలుస్తామని తొగుట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి భరోసా ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వామి తీవ్రంగా గాయపడగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ప్రమాదంలో స్వామి కుడిచేతికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమించి వైద్యులు కుడిచేతిని తొలగించాల్సి వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన స్వామికి వైద్య చికిత్స ఖర్చులు భారంగా మారడంతో ఈ విషయాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సీఎం సహాయనిధి ద్వారా రూ.1,50,000 ఆర్థిక సాయం మంజూరు చేయించగా, ఆ మొత్తాన్ని బీఆర్ఎస్ నాయకులు స్వామి భార్య చంద్రకళకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి గాయం తీవ్రంగా ఉండటంతో ఇంకా ప్లాస్టిక్ సర్జరీ అవసరమయ్యే అవకాశం ఉందని, తదుపరి చికిత్స కోసం కూడా తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అందించిన ఆర్థిక సహాయానికి స్వామి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే స్వామి పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలియజేయగా స్పందించి సహాయం చేసిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటరావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్, ఉప సర్పంచ్ లచ్చోళ్ల లింగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులిగారి శివయ్య, వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, జహంగీర్, మిద్దె శ్రీనివాస్, ఎంగలి నరేందర్, నాయకులు డబ్బికారి పెంటోజీ, ఎర్రోళ్ల చంద్రం, వడ్డె నర్సింలు, సుతారి రాములు, ఈదుగాళ్ల పర్శరాములు, కొక్కొండ సురేష్, కత్తుల రమేష్, పాత్కుల బాలేష్, సత్తయ్య, బాలయ్య, ప్రశాంత్, శేఖర్, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ వితరణ....



ఖమ్మం //మార్చి 10 (ఆకాంక్ష) : ఖమ్మం జిల్లా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మల్లాది సుబ్బమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. విద్యార్థుల విద్యా సౌకర్యాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో సుమారు రూ.20 వేల విలువైన కంప్యూటర్‌ను ట్రస్ట్ తరఫున మల్లాది సుబ్బమ్మ కుమార్తె విజయలక్ష్మిపట్టాభి రామారావు దంపతులు కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారికి అందించారు.ఈ సందర్భంగా దాతృత్వం చూపిన విజయలక్ష్మి పట్టాభి రామారావు దంపతులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థుల అభ్యాసానికి ఆధునిక సాంకేతిక వనరులు అవసరమని, అందులో భాగంగా ఈ కంప్యూటర్ ఎంతో ఉపయోగ పడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి తెలిపారు.దాతృత్వంతో విద్యాసంస్థలకు సహకరించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేకు శ్రీకారం...

### రైతుల భూ హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం : అదనపు కలెక్టర్ నగేష్...



మెదక్//మార్చి 10 (ఆకాంక్ష) : రైతుల భూ హక్కులను పక్కాగా నమోదు చేసి భూ వివాదాలకు పూర్తిస్థాయిలో ముగింపు పలికే లక్ష్యంతో భూ రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్థులు, రైతులకు భూ రీ సర్వే అవసరం, ప్రయోజనాలపై అధికారులతో కలిసి వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ కాలంలో సుమారు వందేళ్ల క్రితం 35 నుంచి 40 సంవత్సరాలపాటు శ్రమించి భూముల నక్షాలను రూపొందించినట్లు తెలిపారు. ఆ కాలంలో రూపొందించిన భూ రికార్డులు, నక్షాలలో కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. భూముల సరిహద్దులు, యాజమాన్య హక్కులపై వివాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వాటిని శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని చెప్పారు.రీ సర్వే ద్వారా ప్రతీ భూ కమతాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో మళ్లీ కొలిచించి ఆన్‌లైన్ డిజిటల్ రికార్డులలో నమోదు చేయనున్నట్లు వివరించారు. తద్వారా రైతులకు భూధార్ కార్డులను జారీ చేసి వారి భూ హక్కులను మరింత బలపరచనున్నట్లు తెలిపారు. భూమి ప్రతి రైతుకు ఎంతో విలువైన ఆస్తి మాత్రమే



కాకుండా భావోద్వేగానికి ప్రతీకగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమ భూముల కోసం ఎన్నో కష్టాలు పడుతుంటారని, అలాంటి రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మెదక్ జిల్లాలో మొదటి దశలో 24 గ్రామాల్లో భూ రీ సర్వే కార్యక్రమాన్ని శాస్త్రీయంగా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. రీ సర్వే పూర్తయ్యాక భూముల వివరాలు పూర్తిగా డిజిటల్ రికార్డులలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. విదేశాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో ఉన్న భూమి యజమానులు సైతం తమ భూముల వివరాలను ఆన్‌లైన్ ద్వారా సులభంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంతో భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ణయించబడటంతో భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, డీపీఆర్వో రామచంద్రరాజు, తహసీల్దార్ రజినీ, ఎంపీడీవో, అక్కన్నపేట గ్రామ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. అధికారులు రైతులకు రీ సర్వే ప్రక్రియపై వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

## మహిళలను గౌరవించే సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలి...



హైదరాబాద్//మార్చి 10 (ఆకాంక్ష) : మహిళలను, బాలికలను గౌరవించే సమాజం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యాలయంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శివకుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించడం ప్రతి కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే మహిళల పట్ల గౌరవ భావాన్ని నేర్పించాలని సూచించారు.మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, అటువంటి నేరాలకు పాల్పడే వారితో పాటు వారి తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సిన పరిస్థితి రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో మహిళల భద్రతకు అందరూ కలిసి పనిచేస్తేనే సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు విద్యాపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, సేవ్ ద గర్ల్ చైల్డ్ మహిళా బృంద సభ్యులు డా. స్రవంతి, గీతారెడ్డి, రాగి స్వప్న, డా. శ్రీవాణి, ప్రియాంక, రజిత, మౌనిక, సౌజన్య, సుభాషిణి పాల్గొన్నారు. అలాగే ముందడుగు ఫౌండేషన్ సభ్యులు కొన్నె దేవేందర్, కొమటి రమేష్‌బాబు, శివనాగరాజు, ప్రశాంత్ తదితరులు హాజరయ్యారు.

## వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్ల కూల్చివేతపై బాధితుల ఆవేదన...




ఖమ్మం//మార్చి 10 (ఆకాంక్ష) : ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేయడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల పాటు కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న తమ ఇళ్లను ఒక్కసారిగా నేలమట్టం చేయడంతో నిలువ నీడ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా తమ ఇళ్లను కోల్పోయిన పేదలు రోడ్డున పడిపోయారని స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల కూల్చివేత తర్వాత తమ వద్ద ఉన్న సామగ్రితో చెట్ల కింద, వాహనాల్లో తలదాచుకుంటూ రోజులు గడుపుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు.వెలుగుమట్లలో జరిగిన ఇళ్ల కూల్చివేత ఘటనపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. "మా భూములు మాకివ్వాలి.. మాకు ఎవరూ దానం చేయాల్సిన అవసరం లేదు. మేము ఎవరిని ఏదైనా అడగడం లేదు. చట్ట ప్రకారం ముందుకు వచ్చి మాట్లాడాలని మాత్రమే కోరుతున్నాం. మా సొమ్ముతో ఇళ్లు కట్టుకున్నాం. మా సొమ్ము మీద నిర్మించిన ఇళ్లను ఇలా కూల్చివేయడానికి ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు" అని ఆమె మండిపడింది.ఇళ్లను కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా అక్కడ నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా కోరుతున్నారు.ఇళ్ల కూల్చివేత తర్వాత నిరాశ్రయులైన కుటుంబాలు కట్టుబట్టలతోనే బయటకు రావాల్సి వచ్చిందని, తమ వద్ద ఉన్న కొద్దిపాటి సామగ్రితో చెట్ల కింద, వాహనాల్లో తలదాచుకుంటున్న దృశ్యాలు స్థానికులను కలచివేస్తున్నాయి. చిన్న పిల్లలతో పాటు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.వెలుగుమట్లలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఇప్పటికే సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. బాధితుల దయనీయ పరిస్థితి చూసిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## గురుకులాల వసతిగృహాల్లో నాసిరకం భోజనండ

### విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు...



మెదక్//మార్చి 10 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకులాలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు ప్రతిరోజూ అందించాల్సిన నాణ్యమైన, పోషకాహార భోజనం అందడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక గురుకులాలు, వసతిగృహాల్లో విద్యార్థులకు పెట్టే అన్నం, కూరలు నాసిరకంగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.విద్యార్థుల ఆరోగ్యం, చదువుల అభివృద్ధి దృష్ట్యా గురుకులాలు, వసతిగృహాల్లో పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలు సరిగా జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొన్నిచోట్ల సరిగా ఉడకని అన్నం, రుచిలేని కూరలు అందిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో అయితే భోజనం నాణ్యత చాలా దారుణంగా ఉందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొంత మంది నిర్వాహకులు, సిబ్బంది తక్కువ ఖర్చుతో నాసిరకం సరుకులు కొనుగోలు చేసి భోజనం తయారు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యమైన బియ్యం, కూరగాయలు అందించాల్సిన చోట నాసిరకం పదార్థాలు ఉపయోగిస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు చెబుతున్నారు. దీని వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్ల గురుకులాలు, వసతి గృహాల్లో అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయని తల్లిదండ్రులు, ప్రజలు అంటున్నారు. గురుకులాల్లో బాధ్యతగా పనిచేయాల్సిన కొందరు అధికారులు కూడా ఈ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనబెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల రేగోడు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో, అలాగే నర్సాపూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటనలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ సంఘటనల నేపథ్యంలో గురుకులాలు, వసతిగృహాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతపై మరింత సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గురుకులాలు, వసతిగృహాల్లో పరిస్థితులను సమీక్షించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పార్టీ మార్పుపై కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటా: జీవన్ రెడ్డి



హైదరాబాద్//మార్చి 10 (ఆకాంక్ష) : మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజే తన పరిస్థితి గురించి చెప్పానని కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ లో కొనసాగాలా వద్దా అనేది ఆలోచించేలా చేశారని అన్నారు. పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సమయం, సందర్భం వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటానని తెలియజేశారు. పార్టీ మార్పుపై కార్యకర్తల అభిప్రాయం తీసుకుంటానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

## కేంద్రం నుంచి వచ్చే నిధులు దయ కాదు.. తెలంగాణ హక్కు

### మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్//**మార్చి 10 (ఆకాంక్ష) :** రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ కు పొన్నం బహిరంగ సభ లేఖ రాశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు దయ కాదు.. తెలంగాణ హక్కు అని తెలియజేశారు. పనులు చెల్లిస్తున్నప్పుడు ప్రజల అభివృద్ధికి ఎందుకు చర్యలు చేపట్టలేదు? అని పొన్నం ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్లు విస్మరించడం తగదు అని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులపై బండి సంజయ్, కిషన్ రెడ్డి బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని, కేంద్ర ప్రయోజిత పథకాల్లో కేంద్ర వాటా 90 శాతం ఉండే విధంగా పునరుద్ధరించాలని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరించాలి : గౌరవ్ గొగొయ్



న్యూఢిల్లీ//**మార్చి 10 (ఆకాంక్ష) :** ఇప్పటి వరకు లోక్ సభలో డిప్యూటీ స్పీకర్ లేరని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగొయ్ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ లేకుండానే లోక్ సభ నడుస్తోందని అన్నారు. స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగింది. లోక్ సభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్పీకర్ అవిశ్వాస చర్చకు 10 గంటలు కేటాయించారని, అవిశ్వాస తీర్మానంపై నెగ్గాలంటే 278 మంది సభ్యుల మద్దతు, ప్రస్తుతం లోక్ సభలో ఎన్డిఎకు 293 మంది సభ్యుల మద్దతు అవసరం అని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతున్నప్పుడు.. స్పీకర్ ఓం బిర్లా తరచూ అంతరాయం కలిగించేవారని, పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరించాలని గౌరవ్ గొగొయ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రసంగానికి స్పీకర్ అనుమతించలేదని, 8 మంది విపక్ష సభ్యులను సరైన కారణం లేకుండానే స్పీకర్ ఓ బిర్లా సస్పెండ్ చేశారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడిపై కాంగ్రెస్ ఎంపిలు దాడి చేసే అవకాశం ఉందని స్పీకర్ తప్పుడు ఆరోపణలు చేశారని, మైక్ ఇవ్వకుంటే విపక్షాల వాణి ప్రజలకు ఎట్లా తెలుస్తుందని ప్రశ్నించారు. లోక్ సభ ఎలా నడుస్తోందో దేశమంతా చూస్తోందని అన్నారు. వ్యక్తిగతంగా స్పీకర్ ఓం బిర్లాపై ఎలాంటి కోపం లేదని గౌరవ్ గొగొయ్ పేర్కొన్నారు.

### బాధితులకు భూదాన్ భూమిలోనే

## డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి: కవిత



హైదరాబాద్//**మార్చి 10 (ఆకాంక్ష) :** వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా తాము దీక్ష చేస్తున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చిన భూములు అని అన్నారు. ఖమ్మంలో దీక్ష చేస్తుండగా అరెస్టు చేసి హైదరాబాద్ కు తరలించారు. హైదరాబాద్ లో తెలంగాణ జాగృతి కార్యాలయానికి కవిత చేరుకుని.. నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం 31 ఎకరాల పేదల భూమిని పెద్దవారికి ఇచ్చే ప్రయత్నం చేస్తోందని కవిత విమర్శించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి తమ దీక్ష కొనసాగుతూనే ఉందని, బాధితులకు భూదాన్ భూమిలోనే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఇళ్లు ఇచ్చి..న్యాయం జరిగేదాకా నిరహార దీక్ష కొనసాగిస్తానని తెలియజేశారు. ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నా.. బాధితుల పరిస్థితి దారుణంగా ఉందని మండిపడ్డారు. భూదాన్ భూముల్లోని ఇళ్లను ఎందుకు కూలగొడుతున్నారని, పట్టాలు ఉన్న వారి ఇళ్లను ఎలా తొలగిస్తారు? అని ప్రశ్నించారు. విద్యార్థులకు పరీక్షలు ఉన్నామని తెలిసి కూడా ఇళ్లను తొలగించారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదల ఇళ్లంటే లెక్కలేదని ధ్వజమెత్తారు. వెలుగుమట్లలో ఏం జరిగిందో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలుసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాస్తున్నాం అని కవిత పేర్కొన్నారు.

## మైసమ్మగూడ హాస్టల్‌లో కానిస్టేబుల్ వీరంగం..

### గదుల్లోకి దూరి విద్యార్థులపై లాఠీఛార్జ్..



హైదరాబాద్//**మార్చి 10 (ఆకాంక్ష) :** హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మైసమ్మగూడలో అర్ధరాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు మద్యం సేవించి సెక్యూరిటీ గార్డుతో గొడవకు దిగడమే ఈ వివాదానికి దారితీసింది. అయితే ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే క్రమంలో విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారు. హాస్టల్ గదుల్లోకి చొరబడి, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడమే కాకుండా వారిని రాయలేని విధంగా బూతులు తిట్టాడు.ఇక తమపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, కనీసం వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల దాడికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యార్థి లోకం భగ్గుమంది. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే తాము జోక్యం చేసుకున్నామని, విద్యార్థుల ప్రవర్తన వల్లే బలాన్ని ప్రయోగించాల్సి వచ్చిందని పోలీసులు చెప్తున్నప్పటికీ, గదుల్లోకి దూరి కొట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### దేశంలో గ్యాస్ కొరత.. ముంబైలో

## 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్‌లు మూత



ముంబై//**మార్చి 10 (ఆకాంక్ష) :** దేశంలో చమురు గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఆందోళన కలిగిస్తున్నది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబై లో 20 శాతం హోటళ్లు (నశీవశ్రీం), రెస్టారెంట్‌లు మూతపడ్డాయి. ఈ విషయాన్ని ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది.పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్నది. ముంబై మాత్రమే కాదు, గత రెండు రోజులుగా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో వాణిజ్య సిలిండర్‌ల కొరత ఏర్పడింది. ఢిల్లీ, బెంగళూరులో ఇప్పటికే కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటులో లేక తాత్కాలికంగా మూసివేస్తున్నారు. సిలిండర్ల కొరతవల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.మరోవైపు, ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇక వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ఓ కమిటీని వేసింది.కాగా మన దేశంలో ఏటా 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 62 శాతం దిగుమతుల నుంచి వచ్చేదే. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఈ దిగుమతులపై ప్రభావం పడింది. అయితే ప్రస్తుతం మన వద్ద సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులోనే ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. హాస్టల్ లు, స్కూల్స్, కళాశాలలో అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య...



సంగారెడ్డి//**మార్చి 10 (ఆకాంక్ష) :** సంగారెడ్డి నియోజకవర్గం లోని ప్రభుత్వ గర్ల్స్ ,బాయ్స్ హాస్టళ్లు, హై స్కూల్ లు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల లో బాత్ రూమ్ లు, అదనపు గదులు, స్వంత భవనాలు, మంచి నీటి వసతుల కల్పన కోసం కలెక్టర్ ప్రావీణ్య, నిర్మల, జగ్గారెడ్డి రివ్యూ సమావేశం నిర్వహించారు, ఏప్రిల్ 10 వ తేదీ లోపల హాస్టల్ లు, స్కూల్స్, కళాశాలలో అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతుల కల్పన కోసం 60 శాతం పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో పాటు 40 శాతం నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తీసుకువస్తామని జగ్గారెడ్డి, నిర్మల తెలిపారు. కలెక్టర్ రివ్యూ సమావేశం లో పాల్గొన్న సిపిఒ, బిసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు, అన్ని జూనియర్ , డిగ్రీ కలశాల ప్రిన్సిపల్స్ . కూన సంతోష్, మున్సిపల్ చైర్మన్ వనిత, వైస్ చైర్మన్ షఫీ, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, వైస్ చైర్మన్ చిరు, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, సిడిసి చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిద్రు ప్పా రఘు గౌడ్, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా రెడ్డి, పార్టీ అధ్యక్షు లు జార్జ్, సిద్దన్న, బుచ్చి రాములు, మోతి, కంది సర్పంచ్ శ్రీరామ్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రక్త దానం మహాదానం.. తోటి వారికి ప్రాణదానం....

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి...**

**117 వ సారి స్వచ్ఛంద రక్తదానం చెసి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్న సాయి చౌదరి...**



వికారాబాద్//**మార్చి 10 (ఆకాంక్ష) :** మహిళా దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరం లో వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి 117 వ సారి స్వచ్ఛంద రక్తదానం చేసారు.ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రక్త దానం మహాదానమని తోటి వారికి ప్రాణదానం అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి తోటి ప్రాణాలు కాపాడాలని పిలుపు నిచ్చారు. మహిళా దినోత్సవ సందర్భంగా నేడు మహిళా దినోత్సవ సందర్భంగా 117 వ సారి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి రక్తదాన చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సాయి చౌదరి కలెక్టర్ దీపక్ తివారి నుండి రక్తదాన ప్రశంసా పత్రం అందుకున్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి...

### మండల పశువైద్యాధికారి డా. జీవిత...




నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 10 (ఆకాంక్ష) :** వేసవి కాలంలో పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలంటే గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని బిజినేపల్లి మండల పశు వైద్యాధికారి డాక్టర్ జీవిత రైతులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలో మంగళవారం గాలికుంటు నివారణ టీకాల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని, ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. మంగనూరు గ్రామంలో మూడు రోజులుగా టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15 ఎద్దులు, 185 గేదెలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలు వేశామని తెలిపారు.మంగళవారం నుంచి శుక్రవారం వరకు మంగనూరు గ్రామంలో ఈ టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, అనంతరం పోలేపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో కూడా టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో మంగనూరు సర్పంచ్ బాల్ నరసింహ, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, ఎల్ఎస్ఏ జ్యోతి, వీఏ హాజీ మైనుద్దీన్, గోపాలమిత్ర వెంకటస్వామి, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కవిత అరెస్టు కాంగ్రెస్ దిగజారుడు విధానానికి నిదర్శనం...

### హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్...




గోదావరిఖని//**మార్చి 10 (ఆకాంక్ష) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడాన్ని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు.మంగళవారం గోదావరిఖనిలో మాట్లాడిన ఆయన, ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమని పేర్కొన్నారు. పేదల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన నాయకురాలిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ఎన్నో సంవత్సరాలుగా ఖమ్మం జిల్లాలో పేదలు కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను హైడ్రా పేరుతో నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం సరైన చర్య కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ చర్యల వల్ల నిరాశ్రయులైన పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రేవంత్ సర్కార్ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని, బీద మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ ఇళ్ల కూల్చివేత చర్యలు చేపడుతోందని రియాజ్ అహ్మద్ ఆరోపించారు. చెరువుల బఫర్ జోన్లను ఉల్లంఘించి పెద్ద పెట్టుబడి దారులు, వ్యాపారవేత్తలు నిర్మించిన వ్యాపార సముదాయాలపై మాత్రం చర్యలు తీసుకోకుండా, సామాన్య ప్రజల ఇళ్లను మాత్రమే హైడ్రా పేరుతో కూల్చివేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు.పేదల పక్షాన పోరాడుతున్న కల్వకుంట్ల కవితను అడ్డుకొని అరెస్టులు చేయడం తగదని, ఇలాంటి చర్యలను వెంటనే మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పేదల ఇళ్ల కూల్చివేతలపై పునరాలోచన చేయాలని కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి 3 రోజుల జైలు శిక్ష..




గోదావరిఖనిటౌన్//మార్చి 10 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పరిధిలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వారిపై కోర్టు కఠిన చర్యలు తీసుకుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 17 మందిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందుకు మంగళవారం హాజరు పరచగా, అందులో 15 మందికి రూ.30,000 జరిమానా విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు తెలిపారు.అదేవిధంగా రెండవసారి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించింది. వారిలో ఒకరు గోదావరిఖనిలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, మరొకరు ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శిక్ష పడిన ఇద్దరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చట్ట విరుద్ధమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## బీజేపీ నిర్లక్ష్యంతో ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థ దెబ్బతింటోంది...

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ...



గోదావరిఖని//**మార్చి 10 (ఆకాంక్ష) :** ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం ఎరువుల తయారీ సంస్థను సరైన నిర్వహణ లేకుండా నడుపుతున్నారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్‌మెంట్, నిర్లక్ష్యంపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు పలుమార్లు లేఖలు రాసినట్లు ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా కూడా కలిసి సమస్యలను వివరించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని విమర్శించారు.ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థలో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదని, కేవలం సుమారు 70 శాతం మాత్రమే ప్రొడక్షన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. దీంతో సంస్థ సామర్థ్యం తగ్గిపోవడమే కాకుండా ఎరువుల సరఫరాపై కూడా ప్రభావం పడుతున్నట్లు తెలిపారు.సంస్థ హెడ్ ఆఫీస్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండటంతో ఇక్కడి సమస్యలపై తగిన శ్రద్ధ పడటం లేదని ఎంపీ వంశీకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. అందువల్ల హెడ్ ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలని పలుమార్లు లేఖలు, విజ్ఞప్తులు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. హెడ్ ఆఫీస్‌ను మార్చే అవకాశంలేదని కేంద్రం అధికారికంగా లేఖ ద్వారా తెలియజేసిందని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల సంస్థ నిర్వహణపై మరింత ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.గతంలో మూతపడిన ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థను తిరిగి ప్రారంభించేందుకు మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి, కాకా కలిసి అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌తో చర్చలు జరిపి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అనంతరం వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో కూడా తీవ్రంగా శ్రమించి సంస్థను మళ్లీ ప్రొడక్షన్‌లోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన చెప్పారు.రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా తెలంగాణకు యూరియా సరఫరా జరగడంతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు పంపిణీ అయ్యే విధంగా వ్యవస్థ పనిచేసిందని వివరించారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో యూరియా నిర్వహణలో గందరగోళం నెలకొన్నదని విమర్శించారు. సరైన విధంగా ఎరువుల దిగుమతులు చేయకపోవడం, ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ పరిస్థితి తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, దీనిపై నిరసన కొనసాగిస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## నగరాన్ని విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాలి..

### రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్...



గోదావరిఖని//**మార్చి 10 (ఆకాంక్ష) :** నగరాన్ని విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జరుగుతున్న ప్రయత్నాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగుండం నగరంలోని 19వ డివిజన్ అల్లూరు, సంతోష్ నగర్ ప్రాంతాలతో పాటు 38వ డివిజన్ సీతానగర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన నగర మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీలతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ బొందలగడ్డగా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మించి అద్భుత నగరంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని తెలిపారు. విమర్శలను లెక్కచేయకుండా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని, ఈ క్రమంలో ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. రామగుండం నగరానికి త్వరలోనే రెండు కొత్త భారీ పరిశ్రమలు రానున్న నేపథ్యంలో ఐదు లక్షల జనాభాతో మహానగర స్థాయికి ఎదగనున్నదని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయని ఆయన తెలిపారు. రామగుండం నగరంలో కూడా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నగరంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఏటీసీ, పీజీ కళాశాల, నర్సింగ్ కళాశాలతో పాటు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.స్వశక్తి మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేందుకు కోట్లాది రూపాయల సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని ఎమ్మెల్యే తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనను ప్రోత్సహించేందుకు రామగుండం నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అల్లూరు, సంతోష్ నగర్ ప్రాంతాల్లో డ్రెయిన్‌లపై నిర్మించిన అనధికార కట్టడాలను తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎన్‌టీఆర్ నగర్, కళ్యాణ్ నగర్, సీతానగర్ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న పెద్ద కాలువను శుభ్రపరచి పక్కనే రోడ్డు నిర్మించే యోచన కూడా ఉందని తెలిపారు. స్వంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు, స్థలం లేని పేదలకు స్థలంతో పాటు ఇండ్లు కూడా మంజూరు చేస్తామని చెప్పారు. సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు కూడా ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాజరైన వారితో నగర మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో చెత్త వేయడం వల్ల దోమలు పెరిగి అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నగర పాలక సంస్థ అందిస్తున్న స్వచ్ఛ వాహనాలకు మాత్రమే చెత్త అందించి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నేతృత్వంలో రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మేయర్ తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు మున్సిపల్ సేవలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి రామగుండం నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో విలీన గ్రామం వెంకట్రావుపల్లి కుమారస్వామి నగర్‌లో నిర్మించిన ఉపరితల వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి కలిసి ప్రారంభించారు. అనంతరం అల్లూరు, సంతోష్ నగర్ ప్రాంతాల్లో కాలువలను పరిశీలించగా, సీతానగర్‌లో చెత్త విభజన, సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు మారెల్లి సుశీల రాజిరెడ్డి, నెలకొంటి రాము, బుర్ర శశికళ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో సీఐఎస్ఎఫ్ 57వ రైజింగ్ డే వేడుకలు...



గోదావరిఖనిటౌన్ //**మార్చి 10 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఆర్ఎస్‌టీపీఎస్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 57వ రైజింగ్ డే వేడుకలు మంగళవారం ఘనంగా,ఉత్సాహ భరితంగా నిర్వహించారు. దేశంలోని కీలక పారిశ్రామిక సంస్థలకు భద్రత కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న సీఐఎస్ఎఫ్ సేవలను ఈ సందర్భంగా అధికారులు ప్రశంసించారు. రామగుండంలోని ఆర్ఎస్‌టీపీఎస్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో సాంప్రదాయిక సెరిమోనియల్ పరేడ్‌ను నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్రమశిక్షణతో అడుగులు కలిపి పరేడ్‌లో పాల్గొని తమ సమన్వయం, అంకితభావం, ప్రొఫెషనలిజాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆర్ అండ్ టి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథిని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్ సర్కార్, డిప్యూటీ కమాండెంట్ ఎస్.ఏ. రాజు, డిప్యూటీ కమాండెంట్ ఓ.వి.కె.ఎస్. శాస్త్రి ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌ను ప్రత్యేకంగా అలంకరించి కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా నిర్వహించారు.పరేడ్ అనంతరం సీఐఎస్ఎఫ్ సిబ్బంది రూమ్ ఇంటర్వెన్షన్ డెమోను ప్రదర్శించారు. ఆపరేషనల్ సిద్ధత, టాక్టికల్ నైపుణ్యాలను ప్రతిబింబించేలా సిబ్బంది చేసిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. దేశంలోని ముఖ్యమైన పారిశ్రామిక సంస్థలు, కీలక ప్రాజెక్టులకు భద్రత కల్పించడంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.కార్యక్రమంలో ముఖ్య అతిథి చందన్ కుమార్ సమంత బెస్ట్ పరేడ్ కమాండర్ మరియు బెస్ట్ ప్లాటూన్‌కు బహుమతులు ప్రదానం చేసి వారి అద్భుత ప్రదర్శనను అభినందించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ దేశ భద్రతకు సేవలందిస్తున్నారని ఆయన కొనియాడారు.ఈ వేడుకలకు ఎన్టీపీసీ మేనేజ్‌మెంట్‌కు చెందిన సీనియర్ అధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేశంలోని కీలక పారిశ్రామిక సంస్థలను రక్షించడంలో సీఐఎస్ఎఫ్ చేస్తున్న సేవలు అమూల్యమని వారు అభిప్రాయ పడ్డారు. సీఐఎస్ఎఫ్ 57వ రైజింగ్ డే వేడుకలు రామగుండంలో భద్రతా దళాల అంకితభావం, ధైర్యం, క్రమ శిక్షణను ప్రతిబింబించేలా ఘనంగా సాగాయి.